RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 105 శుక్రవారం, మే 24, 2024 పేజీలు : 4

### జనవరి నుంచి సన్నబియ్యం

హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే జనవరి నుంచి రేషన్‌షాపుల ద్వారా లబ్దిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో 90.23లక్షల మేరకు రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికోసం ప్రతినెల ప్రభుత్వం 1.75లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం పంపిణీ చేస్తోంది. సన్నబియ్యం పంపిణీ ద్వారా రాష్ట్రంలోని 2.82కోట్ల మందికి లబ్ది చేకూరనుంది.సన్నబియ్యం పంపిణీపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయాత్మక ప్రకటన వెలువరించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

## హత్యా రాజకీయాలు మంచిది కాదు..

# మంత్రివర్గం నుంచి జూపల్లిని బర్తరఫ్ చేయాలి : కేటీఆర్




వనపర్తి : హత్యా రాజకీయాలు తెలంగాణకు మంచిది కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాలుగు నెలల కాలంలోనే ఇద్దరి హత్యలకు కారణమైన మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బొడ్డు శ్రీధర్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్యకు జూపల్లి కృష్ణారావే బాధ్యత వహించాలి. ఇది మొదటి హత్య కాదు. పేరుకేమో ప్రజాపాలన.. చేస్తున్నది ప్రతీకార పాలన. ప్రతీకారంతో రగిలిపోతూ ఎన్నికల్లో వత్తాసు పలకని వారి మీద ప్రతీకారం తీర్చుకునే దిక్కుమాలిన పాలన.. ఇది కాంగ్రెస్ పాలన. ఈ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి కొల్లాపూర్‌లో తీసుకొచ్చారు. జనవరిలో మల్లేష్ యాదవ్, ఇప్పుడు శ్రీధర్ రెడ్డి హత్యకు కారణమయ్యారు జూపల్లి. ఒకటే నియోజకవర్గంలో నాలుగు నెలల వ్యవధిలో రెండు హత్యలు జరిగాయంటే మంత్రి ప్రమేయం, ప్రోద్బలం లేకుండా ఆయన అనుచరులు ఇంత దారుణాలకు తెగబడరు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మంత్రి జూపల్లిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఉండే పోలీసు వ్యవస్థ మీద మాకు నమ్మకం లేదు. వరుస హత్యలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలి. లేదంటే జ్యుడిషియల్ విచారణకు ఆదేశించాలి. ఈ హత్యల్లో ప్రభుత్వ పాత్ర, మంత్రి పాత్ర లేకపోతే నిష్పక్షపాతంగా విచారణ జరిగేందుకు సహకరించాలి. కొల్లాపూర్ ప్రాంతంలో హింసాయుతమైన సంస్కృతి కనబడుతుంది.. గ్రామీణ ప్రాంతాల్లో దాడులకు పాల్పడుతున్నారు.. చెలరేగిపోతున్నారు.. అయినా పోలీసులు ప్రేక్షపాత్ర వహిస్తున్నారు. అవసరమైతే పికెట్లు, క్యాంపులు ఏర్పాటు చేయాలని డీజీపీని మా నాయకులు కలిశారు అని కేటీఆర్ గుర్తు చేశారు. శ్రీధర్ రెడ్డి హత్యకు గురైనట్టు ఉదయం 5.30కు పోలీసులకు ఫోన్ చేస్తే గంటన్నర తర్వాత వచ్చి ప్రేక్షకపాత్ర పోషించారు. ఈ కేసులో ముందుగా ఎస్ఐని సస్పెండ్ చేయాలి. మా కార్యకర్తలు కూడా రగిలిపోతున్నారు. ఇదే దాడుల సంస్కృతి కొనసాగితే మేం కూడా నియంత్రించలేం. ఈ సంస్కృతి రాష్ట్రానికి మంచిది కాదు. ఇలాగే హత్య రాజకీయాలు కొనసాగితే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టిడికి కూడా వెనుకాడం. శ్రీధర్ రెడ్డి తండ్రిని సముదాయించలేకపోతున్నాం. శ్రీధర్ రెడ్డి హత్య వెనుకాల జూపల్లి కృష్ణారావు ఉన్నాడని కేసు పెడితే, మంత్రి పేరు ఉపసంహరించుకోవాలని పోలీసులు ఒత్తిడి తెస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. హత్యలు, దాడులు, కేసులు, సోషల్ మీడియాలో పోస్టులు పెడితే బెదిరింపులు, బైండోవర్లు ఇదేనా నీ చిల్లర రాజకీయం అని కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సంస్కృతి కొనసాగితే తెలంగాణకు మంచిదికాదు. ఈ హత్య రాజకీయాలకు తెర దించాలి. శ్రీధర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

### రాజీనామా చేయకుండానే రాజీలేని పోరు

# మోడీ కుట్రలు సాగనివ్వను

**- కేజ్రీవాల్**



న్యూఢిల్లీ : జైలుపాలయిన తాను సిఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని డిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. ఒకవేళ తాను వైదొలిగితే ఇదో తంతుగా తీసుకుని బిజెపి దేశంలోని ప్రతిపక్ష సిఎంలను లక్ష్యంగా చేసుకుని దెబ్బతీయడంలో పట్టపగ్గాలు లేకుండా చేస్తుందని విశ్లేషించారు. పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ స్పందించారు. తన తరువాత మమత బెనర్జీని, ఆ తరువాత స్టాలిన్‌ను ఈ విధంగా ఒక్కొక్కరిని టార్గెట్ చేసుకుంటారని, వారిని ఏదో విధంగా పదవినుంచి తప్పించేందుకు , ముందు జైలుకు పంపించేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో తాను రాజీనామా చేయడం ఆనవాయితీ అవుతుందన్నారు. మద్యం కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన కేజ్రీవాల్. జూన్ 1న తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. మరి సిఎం పదవి నిర్వహణ విషయం ఏమిటనేది కీలకం అయింది. తనకు పదవి ముఖ్యం కాదని, తాను ఢిల్లీలోని మురికివాడల ప్రజల కోసం పాటుపడిన వాడినని, కీలకమైన ఆదాయపు పన్ను కమిషనర్ పోస్టుకు రాజీనామా చేయగానే ముందుగా ప్రజల వద్దకు వెళ్లానని చెప్పారు.

# ఇసి ఆదేశాలు తీవ్రమైన తప్పు



న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకాన్ని రాజకీయం చేయవద్దంటూ కాంగ్రెస్ పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడాన్ని తీవ్రమైన తప్పుగా మాజీ కేంద్ర మంత్రి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు పి చిదంబరం అన్నారు. ప్రభుత్వ విధానాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్ష పార్టీకి ఉందని ఆయన స్పష్టం చేశారు. కుల, మత, భాష, మతపరమైన అంశాలపై ప్రచారం చేయరాదని ఆదేశిస్తూ ఎన్నికల సంఘం బుధవారం అధికార బిజెపి, ప్రతిపక్షాలను ఆదేశించింది. అంతేగాక రక్షణ దళాలను రాజకీయం చేవద్దని, సాయుధ దళాల సామాజిక ఆర్థిక కూర్పుకు సంబంధించి చీలికలు తెచ్చే విధంగా వ్యాఖ్యలు చేయవద్దని కాంగ్రెస్ పార్టీని ఇసి ఆదేశించింది. అగ్నిపథ్ పథకంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్ర నాయకులు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇసి ఈ ఆదేశాలు జారీచేసింది. దీనిపై చిదంబరం గురువారం స్పందిస్తూ..రాజకీయం అంటే ఏమిటని, విమర్శించడమని మీ ఉద్దేశమా అని ఇసిని ప్రశ్నించారు. అగ్నివీర్ అన్న పథకం ప్రభుత్వ విధాన నిర్ణయం నుంచి ఏర్పడిందని, ప్రభుత్వ విధాన నిర్ణయాన్ని విమర్శించే హక్కు ప్రతిపక్ష పార్టీకి ఉంటుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పథకాన్ని రద్దు చేస్తామని చెప్పడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు.

# ఇప్పటికే 310 సీట్లు దాటాం



సిద్ధార్థనగర్ / సంత్ కుబీర్ నగర్ : ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నిర్ణీత రీతిలో విజయం సాధిస్తుందని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికి ముగిసిన ఐదు విడతల పోలింగ్ సరళిని చూస్తే బిజెపి 310 సీట్ల సంఖ్యను దాటిందని, మరో రెండు రౌండ్లు మిగిలి ఉన్నాయని చెప్పారు. ఇక కాంగ్రెస్‌కు ఈసారి 40 స్థానాలు కూడా రావడం కష్టమే అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్‌లో అమిత్ షా గురువారం దొమరియగంజ్ బిజెపి అభ్యర్థి జగదాంబిక పాల్ గెలుపు కోసం జరిగిన ప్రచార సభలో మాట్లాడారు. కాంగ్రెస్‌కు 40 లోపు, ఇక ఈ పార్టీ మిత్రపక్షం ఎస్‌పికి నాలుగు స్థానాలు దక్కుతాయని అమిత్ షా వెల్లడించారు. ఇప్పటికే బిజెపి 310 దాటి మరింతగా ముందుకు వెళ్లే దిశలో ఉందన్నారు. రాష్ట్రంలోనే సంత్ కబీర్ నగర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ ఆయన విపక్ష నేతలకు బంధుప్రీతి, స్వార్థ బుద్ధి తప్పితే మరోటి లేదన్నారు. ఇందుకు అనేక ఉదాహరణలు ప్రస్తావించుకోవచ్చు. లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడిని సిఎం చేయాలని అనుకుంటారు. ఉద్ధవ్ థాకరే తన కుమారుడు ఎప్పుడు సిఎం అవుతాడా? అని చూస్తాడు. శరద్ పవార్‌కు కూతురిని ఈ స్థానంలో చూడాలని తపన ఉంది. ఇక సోనియా గాంధీ తన కుమారుడు ఎప్పటికైనా ప్రధాన మంత్రి కాకపోతాడా అనే ఆశ ఉంది. స్టాలిన్, మమత బెనర్జీ ఈ విధంగా పలువురికి వారి వారి రాజకీయ వారసులే అధికారంలోకి వచ్చి తీరాలనే ఆరాటం ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలకు రిజర్వేషన్లపై రాజకీయ ఆలోచనలు తప్పితే మరో దృష్టి లేదన్నారు. ప్రతిపక్షాలు తమ ఓటు బ్యాంకుల భద్రతకు చివరికి ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల రిజర్వేషన్ కోటాకు కూడా గండిపెడుతున్నాయని మండిపడ్డారు. రాహుల్ బాబాకు, అఖిలేష్ యాదవ్‌లు ఓటు బ్యాంకు రాజకీయాలతో కళ్లకు గంతలు కట్టుకుని ఉన్నారని వారు ఓ వర్గాన్ని ఎంచుకుని ప్రయోజనాలు కల్పిస్తారని, ఈ క్రమంలో కోట్లాది మంది బడుగు వర్గాల కోటాలకు ఎసరు పెట్టిన వారవుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు సరైన విధానాలు అంటూ ఏమీ లేవు. పాకిస్థాన్ నేతలు పిఒకె తమది అంటారు.

### ఆ మంత్రి వైట్ పేపర్ లాంటి వారు...

# ఆయనపై ఇంక్ చల్లకండి: జగ్గారెడ్డి



హైదరాబాద్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వైట్ పేపర్ లాంటి వారని, ఆయనపై ఇంక్ చల్లకండని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. బిజెపి ఎల్‌పి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బట్టకాల్చి ఉత్తమ్‌పై వేస్తున్నారని, ఉత్తమ్‌పై ఆధారాలు లేని అభియోగాలు చేయడం మంచిది కాదన్నారు. ఐదేళ్లు రేవంత్ రెడ్డి సిఎంగా ఉంటారని, తడిసిన ప్రతి గింజను కొంటామని సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పారని, అధికార పార్టీపై ప్రతిపక్షాలు బురదజల్లడం సహజమేనని చురకలంటించారు.

### ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్మెంట్ కమిషనర్‌తో

# సింగరేణి సీఎండీ భేటీ



హైదరాబాద్: రానున్న ఐదేళ్లలో సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీలో సహకారం అందించడంపై ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ కమిషనర్ డెనిస్ ఈటన్ తో (గురువారం) హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి కంపెనీ సీఎండీ ఎన్.బలరామ్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరాం మాట్లాడుతూ%'' % సింగరేణిలో ప్రస్తుతం వినియోగిస్తున్న సాంకేతికత, ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, వృద్ధిరేటు సాధించిన విషయాన్ని వివరించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ కార్యకలాపాల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి కూడా విజయవంతంగా ప్రవేశించినట్లు వివరించారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోని అవకాశాలను క్షుణ్ణంగా అన్వేషిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆస్ట్రేలియాకు చెందిన సింటార్స్ తదితర కంపెనీల నుంచి మైనింగ్, డిఫెన్స్, టెక్నికల్ అంశాల్లో సేవలు పొందారని గుర్తుచేశారు. కాగా, సింగరేణిలో అమలవుతున్న సాంకేతికత, కంపెనీ నూతన వ్యాపార విస్తరణ చర్యలను స్వయంగా చూసేందుకు నవంబర్‌లో ఆస్ట్రేలియా బృందం సింగరేణి రీజియన్‌ను సందర్శించనుందని ఆస్ట్రేలియా కమిషనర్ డెనిస్ ఈటెన్ వివరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఆస్ట్రేలియా కమిషనర్ తో పాటు బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ దస్త్రాల హాజరయ్యారు.

# నకిలీ లోగో...

### ఇద్దరిపై కేసు నమోదు




హైదరాబాద్: టీజీఎస్‌ఆర్టీసీ నకిలీ లోగోను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆర్టీసీ అధికారులు హైదరాబాద్ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతం దిలీప్, హరీష్ రెడ్డిలపై ఐపీసీ, ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. టీజీఎస్‌ఆర్‌టీసీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిందితులు పోస్టులు పెడుతున్నారని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కొత్త లోగో అంటూ సాగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. ఆ లోగోతో కంపెనీకి ఎలాంటి సంబంధం లేదని సజ్జనార్ తెలిపారు. ఇప్పటివరకు కొత్త లోగోను అధికారికంగా విడుదల చేయలేదని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

## సంపాదకీయం

# ఆదర్శ పాత్రికేయుడు నారదుడు.....!

నారదుడు దేవర్షి, సంగీతజ్ఞుడు. నిరంతరం లోక సంచారి. చేతుల్లో చిరుతలు, మహతి అనే వీణా ధారియై, హరి నామ సంకీర్తన చేస్తూ, నిరంతరం తిరుగాడడమే ఆయన పని. ఆయా ప్రాంతాల విశేషాలను అందరికీ తెలుపు తుంటాడు. ఆయన ఒక "ఆదర్శ పాత్రికేయుడు". మంచి చెడుల మధ్య జరిగే యుద్ధంలో ఆయనది ఎప్పుడూ ధర్మ పక్షమే. కృత, త్రేతా, ద్వాపర యుగాలన్నిటిలోనూ ఆయన ఉంటాడు. నారదుడి పేరు ప్రస్తావించని హిందూ పురాణం లేదు. అష్టాదశ పురాణాలు, రామాయణ, మహాభారతాల్లోనూ నారదుడు పాత్ర గురించి వివరించారు. నారదుని జన్మతిథి వైశాఖ బహుళ పాడ్యమి. ఈ తిథినాడే నారద జయంతిని జరుపు కునే సాంప్రదాయం ఉంది. నారదుడు మూడు లోకాల్లోను సంచరిస్తూ భక్తి మార్గాన్ని ప్రచారం చేస్తుంటాడు. ఎంతోమంది సాత్వికులకు అయన మోక్ష మార్గాన్ని చూపించాడు. ధర్మానికి అధర్మానికి జరిగే పోరాటంలో ఆయన తనదైన పాత్ర పోషిస్తుంటాడు. అయితే కొంతమంది మేధావులు, రచయితలు మాత్రం ఆయన్ను "కలహ భోజనుడు" గా "కలహ ప్రియుడు" గా అభివర్ణించారు. వాస్తవానికి, నిజం మాట్లాడే వారికి ఎప్పుడు కష్టాలే. "యదార్ధవాది లోక విరోధి". ఆధునిక కాలంలో కూడా సత్యాన్ని ధర్మాన్ని పాటించే వారంటే చిన్నచూపు. వారిని లోక విరోధులుగానే చూస్తారు. అనేక కష్టాలకు గురి చేస్తారు. నారద మహర్షి కూడా లోక కళ్యాణం కొరకు నిరంతరం తపించేవాడు. ముల్లోకాలలోనూ సంచరిస్తూ దేవ, మానవ, దానవులకు సందర్భాను సారంగా కర్తవ్య బోధ చేస్తుంటాడు. అయితే నారదుడిది ఒకటే లక్ష్యం. ధర్మం గెలవాలి. బ్రహ్మ మానస పుత్రుడు, త్రిలోక సంచారి, నారాయణ భక్తుడు, ముక్తుడు అయిన నారదుడు విశ్వ హితుడు. తెలుగు సాహిత్యం లోనూ, తెలుగు సినిమాల లోనూ నారదుని కలహ ప్రియత్వం, వాక్చతురత తరచు ప్రస్తావించ బడుతాయి. ఉపనిషత్తులు, పురాణములు, ఇతిహాసములలో నారదుని కథలు బహుళంగా వస్తాయి. నారదుని పాత్ర చాలా పురాణాలలో కనిపిస్తుంది. భాగవతం, ప్రధమ స్కంధంలో నారదుడు వేద వ్యాసునికి భాగవతం రచింపమని బోధిస్తాడు. ఈ సందర్భంలోనే నారదుడు తన పూర్వ గాథను వ్యాసునకు వివరిస్తాడు. రామాయణం, బాలకాండలో నారదుడు వాల్మీకికి ఉత్తమ పురుషుడైన శ్రీరాముని గురించి చెప్పి రామాయణం వ్రాయమనీ, అది ఆచంద్రార్కం నిలిచి ఉంటుందనీ ఆనతిస్తాడు. అలా చెప్పిన భాగమే సంక్షిప్త రామాయణంగా చెప్పబడుతుంది. మహా భాగవతం మొదటి స్కంధంలో నారదుడు తన గాథను స్వయంగా వేద వ్యాసునికి తెలిపాడు. తాను పూర్వ జన్మ పుణ్య కారణంగా హరికథా గానం చేస్తూ ముల్లోకాలలో సంచరింప గలుగుతున్నానని చెప్పాడు. పూర్వ కల్పంలో నారదుడు వేదవిదులైన వారింట పని చేసే ఒక దాసికి కుమారుడు. ఒకమారు అతడు చాతుర్మాస్య వ్రతం ఆచరించే కొందరు యోగులకు శ్రద్ధగా పరిచర్యలు చేశాడు. వారు సంతోషించి ఆ బాలునికి విష్ణుతత్వం ఉపదేశించారు. వారి దయవలన ఆ బాలుడు వాసుదేవుని అమేయ మాయా భావాన్ని తెలుసు కొన్నాడు. ప్రణవంతో కలిపి వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధ మూర్తులను స్మరించి నమస్కరించి నట్లయితే సమ్యక్ దర్శనుడు అవుతాడని గ్రహించాడు. ఆయన తల్లి ఒకనాడు పాము కాటువల్ల మరణించింది. అప్పుడు నారదుడు అన్ని బంధముల నుండి విముక్తుడై అడవికి పోయి భగవత్స్వరూపాన్ని ధ్యానించడంలో నిమగ్నమై ఉంటాడు. ఏకాగ్ర ధ్యాన సమయంలో అతని మనస్సులో భగవత్స్వరూపం గోచరించింది. కాని మరుక్షణమే అంతర్ధానమైంది. చింతాక్రాంతుడై నారదుడు అడవిలో తిరుగుతుండగా అతనికి దివ్యవాణి ఇలా ఆదేశమిచ్చింది – ఈ జన్మలో నీవు నన్ను పొందలేవు. కాని నా దర్శనం వల్ల నీ సందేహాలు తొలగి అచంచలమైన భక్తి చేకూరింది. ఈ శరీరం త్యజించిన పిమ్మట నా పార్షదుడవై నన్ను పొంద గలవు. – నారదుడు సంతుష్టుడై నిరంతరం హరి నామ జపం చేస్తూ కాలం గడిపి, అంతిమ సమయం ఆసన్నమైనపుడు తన దేహాన్ని త్యజించాడు. అనంతరం ప్రళయ కాలం సమీపించగా, ఒక సముద్రంలా ఉన్న ఆ జలరాశి మధ్యలో, నిద్రకు ఉపక్రమించిన బ్రహ్మ శ్వాసలో ప్రవేశించి, ఆయనలో లీనమయ్యాడు. వేయి యుగాల కాలం తరువాత బ్రహ్మ లేచి లోకాలను సృష్టించడం ఆరంభించినపుడు, బ్రహ్మ ప్రాణముల నుండి మరీచి మొదలైన మునులతోబాటు నారదుడు కూడా జన్మించాడు. కనుకనే నారదుని బ్రహ్మ మానస పుత్రుడయ్యాడు. అలా నారదుడు అఖండ దీక్షాపరుడై విష్ణువు అనుగ్రహం వలన నిరాటంకంగా సంచరించ గలుగు తుంటాడు. తాను స్మరించగానే నారాయణుని రూపం అతని మనసులో సాక్షాత్కరిస్తుంది...ఇలా తన కథ చెప్పి హరికథా గానంతో నిండి వున్న భాగవతాన్ని రచించమని నారదుడు వేద వ్యాసునికి ఉపదేశించాడు. మహా భారతం సభాపర్వంలో నారదుని గురించి ... వేదోపనిషత్తులను, పురాణాలను బాగా తెలిసినవాడు. దేవతలచే పూజితుడు. కల్పాతీత విశేషాల నెఱిగినవాడు. న్యాయ ధర్మ తత్వజ్ఞుడు. శిక్షా కల్ప వ్యాకరణాలు తెలిసిన వారిలో శ్రేష్టుడు.

# ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి

**- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు.
గురువారం రోజున ఘట్కేసర్ మండలం,ఎదులాబాద్,మాదారం గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఐపీకే ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడ రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని,సేకరించిన ధాన్యం వెంటనే లారీలలో లోడ్ చేయించి ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావు లేకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా తార్పాలిన్ ,గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకొని అధికారులు వరకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థ వంతంగా నిర్వహిస్తూ తుది దశకు చేర్చాలని అన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా దాన్యం సేకరణ జరపాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని తద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులు మొదలుకాక మునుపే విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులు అందించండి : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్






**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులు అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కలెక్టర్ అధికారుల ను ఆదేశించారు. గురువారం మూడుచింతలపల్లి మండలం హెడ్ క్వార్టర్ , కేశవరం, గ్రామాలను సందర్శించారు. మహిళా శక్తి టైలరింగ్ సెంటర్ లను స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు తో కలిసి సందర్శించి పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల చే స్కూల్ యూనిఫాం తయారు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు ఎంత మేరకు కుట్టడం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. దుస్తుల తయారీ లో నాణ్యతను పాటించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థి,విద్యార్థుల కొరకు అందిస్తున్న యూనిఫామ్ దుస్తులు, సకాలంలో కుట్టించి అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మూడు చింతలపల్లి లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ను అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు .అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల తో మాట్లాడి పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.త్రాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ ను, కాంపౌండ్ వాల్ ను పరిశీలించి చిన్న చిన్న మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి స్కూల్స్ లో ఎల్ఈడి బల్బులే వాడాలన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే పూర్తి స్థాయిలో రిపేరు చేయించి అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాల కంటే దీటుగా తీర్చిదిద్దుతామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేలా కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వచ్చలదేవి, మెప్మా అధికారి అనిల్ కుమార్, డి పి యం సురేఖ, అసిస్టెంట్ డైరెక్టర్ లింగానందం, ఏ యం ఓ రవీంద్ర రాజ్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సులోచన, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాకతీయలో కీలక ఫైళ్లు మాయం

**వరంగల్:** కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అవినీతి అక్రమాల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తాటికొండ రమేష్ అవినీతిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఆయన ఉంటున్న లాడ్జి గది నుంచి ముఖ్యమైన ఫైల్స్ మాయమయ్యాయని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి మంగళవారంం రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు.ప్రొ.రమేష్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి విజిలెన్స్ విచారణ కొరకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అదే రోజు విద్యా శాఖ కార్యదర్శి కేయూ రిజిస్ట్రార్ మల్లా రెడ్డికి ఎటువంటి ఫైల్స్ ముట్టకూడదని మౌఖిక ఆదేశాలిచ్చినట్టు ఇస్తారి తెలిపారు. 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యూనివర్సిటీ నుంచి పలు ఫైళ్లు బయటకు వెళ్లాయని ఇస్తారి ఆరోపించారు. విషయం తెలుసుకున్న అకుట్ కమిటీ పరిపాలన భవనానికి చేరుకొని రిజిస్ట్రార్‌ను నిలదీసినట్లు తెలిపారు. వీసీ రమేష్ గత నాలుగు రోజుల నుంచి కేయూకు రావట్లేదని, విజిలెన్స్ విచారణలో అవసరమయిన ఫైళ్లను తారుమారు చేసేందుకు ఇంటికి తరలించారని ఆరోపించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా ఫైళ్లను



బయటకు తీసుకు వెళ్లడంపై ఇస్తారి అనుమానం వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో వీసీ తన పాలనను లాడ్జీ నుండే కొనసాగించారని ఆరోపించారు. లాడ్జి నుంచి తరలించిన ఫైళ్లలో పలు మార్పులు చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వివిధ డీన్ల వద్ద నున్న పీహెచ్‌డీ, పార్ట్ టైం ఫుల్ టైమ్ అడ్మిషన్లకు సంబంధించిన ఫైళ్లు, విద్యార్థులకు వచ్చిన మార్కుల లిస్ట్, కంప్యూటర్ కొనుగోలుకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం ఉందని ఇస్తారి ఆరోపించారు. వీసీకి సంబంధించిన సొంత పుస్తకాలు, మెమెంటోలు, వ్యక్తిగత సామానులు తీసుకువెళ్లి ఉండొచ్చని రిజిస్ట్రార్ చెప్పిన మాటలను ఆకుట్ ఖండిస్తుందని ఇస్తారి చెప్పారు. వీసీ ఉన్న లాడ్జి సీసీ ఫుటేజీని విడుదల చేసి ఫైళ్లు మాయం చేసిన వారిని శిక్షించాలని రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు.

# నిర్విఘ్నంగా ముగిసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** నిర్విఘ్నంగా అంగరంగ వైభవంగా శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసాయి. మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామ పరిధిలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగ జరిగాయి. చివరి రోజు గురువారం ఉదయం ధోపోత్సవం, చక్రస్నానం అనంతరం ఆశీర్వచనం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**శామీర్ పేట, (గరుడ వార్త) :** దేవరయంజాల్ విద్యుత్ సబ్స్టేషన్లో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతుందని శామీర్ పేట విద్యుత్ ఏఈ రమేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శామీర్ పేట సెక్షన్ పరిధిలోని దేవరయంజాల్ విద్యుత్ సబ్స్టేషన్లో మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొత్తపేట ఫీడర్ పరిధిలో మరమ్మత్తులు కారణంగా దేవరయంజాల్ గ్రామం, దేవరయంజా పరిధిలోని గోడౌవన్స్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మందాయి పల్లి ఫీడర్ పరిధిలో మరమ్మత్తులు చేపడుతున్నందున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 ఐదు గంటల వరకు మందాయపల్లి గ్రామం, వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ కోరారు.

## తమిళనాడులో భారీ వర్షాలు.. నీట మునిగిన పలు ప్రాంతాలునీట మునిగిన పలు ప్రాంతాలురహదారులన్నీ జలమయ పొంగిపొర్లుతున్నాయి జలపాతాలు



**చెన్నయ్ మే** తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కన్యాకుమారి, టెన్‌కాశీ, కోయంబత్తూరు, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి.. ఇక, రహదారులన్నీజలమయం అయ్యాయి. ఊటీలోనూ కుండపోత వర్షం కురుస్తోంది. భారీ వర్షానికి జలపాతాలు పొంగిపొర్లుతున్నాయి.పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. చెన్నైతో సహా 7 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

## ప్రైవేటు బస్సు బోల్తా..మహిళ మృతి



**నిర్మల్ జిల్లా,** సారంగాపూర్ మండలం, మహబూబ్ ఘాట్స్ పై ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తున్న ముస్కాన్ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ కు 50 మంది ప్రయాణికులతో వెళ్తుండగా ఘటన జరిగింది. 25 మందికి గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ హైదరాబాద్ తరలిస్తుండగా అదిలాబాద్ పట్టణానికి చెందిన ఫర్హానా అనే 28 సం.ల మహిళ మృతి చెందింది. క్షతగాత్రులను నిర్మల్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

# సంకర సంస్కృతిలోకి దక్షిణాది....!

శతాబ్దాల పాటు మానవ జీవన విధానాలను చిలికి తీసిన మీగడ రూపమే ఆ జాతి సంస్కృతి. ఈ విశాల విశ్వంపై ఆయా నేలల్లో బతుకుతున్న మానవ సమూహాలు అక్కడి కాలమాన, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా వారి ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ఏర్పరుచుకుంటాయి. పెళ్లి తంతు, పిల్లలకు నామకరణం, మృతుల అంతిమ యాత్ర, ఆస్తి పంపకాలు.. ఇలా ఎన్నో అంశాలు తమవైన రీతిలో రూపొందించుకోబడ్డాయి.అవి జాతి ఐక్యతకు, గుర్తింపుకు సూత్రాలుగా పనికొస్తున్నాయి. ఒకే మాటలో చెప్పాలంటే అదే వారి సంస్కృతి. ఎవరైనా ఒక మానవ సమూహాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలంటే ముందు వారి సంస్కృతిని సంకర పరచాలి. వారు నమ్మే గురువులతో కొత్త పాఠాలు చెప్పించాలి. ఇప్పుడు దక్షిణాదిపై ఆర్య సంస్కృతి అదే పంజాను విసురుతోంది. ప్రత్యేకంగా గత పదేళ్లుగా దేశమంతా ఆర్య సంస్కృతిని విస్తరింపజేసే ప్రయత్నం తీవ్రంగా సాగుతోంది. పాలక బిజెపి ఆయా సంస్థలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. కాంగ్రెస్ పాలన కుటుంబ ఆధిపత్యంలో కొనసాగినా ఉత్తర, దక్షిణ భారతాల మధ్య వైషమ్యాల, తారతమ్యాల రేఖలు గీయలేదు. సాంస్కృతిక భేదభావాలు తెరపైకి వచ్చేవి కావు. అందుకే కాంగ్రెస్ సామరస్య భావనని ఇప్పటికీ దక్షిణాది రాష్ట్రాలు నమ్ముతున్నాయి. ప్రస్తుత కేంద్ర పాలన లక్ష్యమే హిందుత్వ భావజాలాన్ని దేశవ్యాప్తంగా పాదుకొల్పడమే అన్నట్లుగా ఉంది. తమ మతపర విధానాలను పాటించకపోతే హిందూ సమాజంలో గుర్తింపు, పలకరింపు ఉండదనే భయం కింది వర్గాల్లో కూడా చొచ్చుకుపోతోంది. మోడీ లేకపోతే ఈ దేశం, తమ మతం ఏమైపోతుందో అనే బెంగ హిందువుల్లో కొత్తగా గూడు కట్టుకుంటోంది. దేశం లో నిరుద్యోగిత, పేదరికం, మత అసహనం పెరిగిపోతున్నా తమ మతం గొప్పగా ఉంటే సరిపోతుంది అనే భావన సాధారణ ప్రజల్లో వ్యాపిస్తోంది. మతమంటే ఓ ఐడెంటిటీ అని మాత్రమే భావించే దక్షిణాది ప్రజల్లో కూడా మెల్లమెల్లగా ఆర్య సంస్కృతి గొప్పదనే భావన వ్యాపించడం స్పష్టంగా కనబడుతోంది. నిజానికి బిజెపి భావజాలమంతా ఉత్తర భారతంలో పుట్టిందే. ఉత్తర భారతీయుల జీవన సరళి, నమ్మకాలు, విశ్వాసాలను అది ప్రతిబింబిస్తుంది. దక్షిణాది ప్రజలు కొలిచే దేవుళ్ళు, వారి నమ్మకాలు, పండుగలు, మొక్కులు తీర్చడాలు పూర్తిగా వేరు. భిన్న ఆచారాల అవలంబన వల్ల 'దక్షిణ'లో బిజెపికి ఆదరణ లభించకపోవడం సహజమే. అయితే దీనికి విరుగుడుగా చర్యలు ఇప్పటికే మొదలయ్యాయి. నేటి ఆధునిక జీవనానికి ఆర్య సంస్కృతియే అసలైన ఆలంబన అనే భ్రమల ప్రచారం సాగుతోంది. ఆ వలలో చిక్కిన దక్షిణాది ప్రజలు ఆర్య సంస్కృతి పాటించే విధానాలపై మోజు పెంచుకుంటున్నారు. నదులకు పూజలు చేసే విధానం దక్షిణాదిన అంతగా లేదు. గోదావరి ప్రవహించే పరిసర గ్రామాల్లో నదిలో తెప్పలు ఆచారంలా కనబడుతుంది. అయితే బ్యారేజీలు కట్టినాక ప్రభుత్వాలు ఇక్కడ కూడా నదులను పూజించడం మొదలైంది. పళ్లెంలో చీర, సారె, పూలు, గాజులు పెట్టి నీళ్లలో వదిలి దండం పెట్టడం ప్రభుత్వ కార్యక్రమంగా మారిపోయింది. ఇలా చేస్తేనే ప్రజలు తమను ఆదరిస్తారనే ఆలోచనే ఆర్య భావజాలానికి బానిసత్వాన్ని సూచిస్తోంది. ఇలా చేయకపోతే ప్రజల మనసును, ఓటును ఎవరో లాగేసుకుంటారనే భయం మిగితా పార్టీల్లో మొదలైంది. యజ్ఞాలు, యాగాలు ఆర్య సంస్కృతిలో భాగమే. దక్షిణం వైపు ఋషులు కనిపించరు. రాజ్యవిస్తరణకు అశ్వమేధయాగం చేపట్టినట్లు ఇప్పుడు రాజకీయ నేతలు చాటుకో నేటికో ఎన్నికల్లో తమ గెలుపు కోసం ఏవేవో యాగాలు చేయడం మొదలుపెట్టారు. ఆర్య సంస్కృతికి ప్రతినిధులుగా ఇక్కడ కొనసాగుతున్న పీఠాధిపతులు వీటికి నేతృత్వం వహిస్తున్నారు. ఇంతకాలం ఇవేవీ లేకుండానే గెలుపోటములు చూశాం కదా అనే విచక్షణ కోల్పోవడం కూడా ఉత్తరాది సంప్రదాయాలకు తల ఒగ్గడమే. వ్యవసాయానికి ఎద్దులను, పాల కోసం బర్రెలను పెంచడం మట్టుకే ఇక్కడి ప్రజలకు తెలిసిన పశు సంపద అవసరాలు. పొలాల అమావాస్య లాంటి పండుగలు జరిగే చోట ఎద్దులను అలంకరిస్తుంటారు. ఆవును పూజించడం, దాని పేడను పవిత్రంగా భావించడం, గోమూత్రాన్ని సేవించడం ఉత్తరాదిలో కనబడే ఆచారం. ప్రత్యేకంగా గోవులను ఒకచోట చేర్చి దాణా పెడుతూ వాటిని దైవ స్వరూపంగా భావించి సాకడం అక్కడి గోశాల విధానం. ఇప్పుడు దక్షిణాన కూడా గోశాలలు మొదలయ్యాయి. కాషాయం ఒక రంగు. ఆ రంగు బట్టలు, తలపాగా, జెండా ఇప్పుడు ఒక జాతి పేటెంట్‌గా మారిపోయింది. దక్షిణాది నగరాల్లోకి వలస వచ్చిన ఉత్తరాది వ్యాపారులు ఈ సంస్కృతిని విరివిగా ప్రచారానికి తెచ్చారు. అన్ని రంగుల్ని ఒక్కలా ఆదరించిన దక్షిణాదిలో ఇళ్లపై కాషాయ జెండా కొత్తగా కనిపిస్తోంది. పెళ్లిళ్లలో హోమాలు, దాండియా, మెహందీ ఫంక్షన్లు వచ్చేశాయి. హిందీ సినిమాల్లో కనబడే ఈ ఉత్తరాది వివాహ ఆచారాలు ఇప్పుడు ఇక్కడ కూడా ప్రాధాన్యతను సాధించాయి. వాలెంటైన్స్ డే రోజున పార్కుల్లో కనిపించే జంటలను వేధించడం, బలవంతంగా రాఖీలు కట్టించడం ఎవరూ ఆపలేని దశకు చేరుకున్నాయి. ద్రవిడ జీవన విధానం వల్ల హిందూ పురాణాలను, ఆచారాలను వ్యతిరేకించే అలవాటు తమిళ ప్రజల్లో పాతుకుపోయింది. ఉత్తరాది భాష, ఆచారాలు, సంస్కృతి అన్నా వారికి పడదు. అందుకే సనాతన ధర్మం తిరోగమన చర్యగా డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ ధీమాగా అనగలిగాడు. తన మాటను వెనక్కు తీసుకోనని కచ్చితంగా చెప్పాడు. రామాయణంలో రాముడు ఉత్తరాది, ఆర్య ప్రతినిధి అని, రావణుడు తమ జాతివాడని వారు నమ్ముతారు. కర్ణాటకలో ముస్లిం విద్యార్థిని హిజాబ్ ధరించి కళాశాలకు కొత్తగా వివాదాస్పదమైంది. కోర్టు కూడా విద్యాలయాల్లో మత విశ్వాసాలు చెల్లవంది. సాధారణ విషయాన్ని కావాలని రాద్ధాంతం చేయడం వెనుక దక్షిణాదిపై ఆర్య సాంస్కృతిక ఆధిపత్యమే కనబడుతుంది. ఈ మధ్య శామ్ పిట్రోడా మాటల్లో వచ్చిన భారతీయుల రంగురూపుల ప్రస్తావన పెద్ద వివాదంగా మారి చివరకు కాంగ్రెస్ పార్టీలో ఆయన పదవిని వదులుకోవలసి వచ్చింది. పిట్రోడా మాటను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆపాదించి ఎన్నికల ప్రచారంలో మోడీ లాభపడాలని చూశారు తప్ప పిట్రోడా మాటకు శ్యామరూపులు ఎవరూ బాధపడటం లేదు. నేల వేడిని బట్టి మనిషి రంగు ఏర్పడుతుంది. ఎవరి సంస్కృతి వారికి గొప్పది. ఇతరుల సంస్కృతులను గౌరవించడం కూడా సంస్కృతిలో భాగమే అనే అవగాహన అందరికీ శ్రేయస్కరం.

## మళ్లీ కోవిడ్



**హైదరాబాద్:** కోవిడ్ ముప్పు మళ్లీ ముంచుకొస్తోందా.. మరోసారి వైరస్ పంజా విసరబోతోందా అంటే అవుననే అంటున్నారు వైద్య నిపుణులు. ఇప్పటికే సింగపూర్‌ను కోవిడ్ కొత్త వేరియంట్ కుదిపేస్తోంది. కేపీ?1, కేపీ?2 వేరియంట్ కేసులు భారీగా నమోదవుతున్నాయి. కొత్త వేరియంట్ వ్యాప్తి అధికంగా ఉన్నట్లు అక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. గడిచిన 20 రోజుల్లో ఆదేశంలో 34 వేల కేసులు నమోదయ్యాయని అధికార వర్గాలు వెల్లడించాయి.సింగపూర్‌లో నమోదవుతున్న కేసులన్నీ జేఎన్1 సంబ్ వేరియంట్లే అని వైద్యులు చెబుతున్నారు. కంగారు చెందాల్సిన అవసరం లేదని పేర్కొంటున్నారు. వైరస్‌లో మ్యుటేషన్ల కారణంగా వైరస్ వ్యాపిస్తోందని తెలిపారు. భారత్‌లో కూడా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటి వరకు కేపీ2 వేరియంట్ కేసులు 290, కేపీ1 కేసులు 34 నమోదైనట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ఇండియన్ సార్స్?కోవ్2 జీనోమిక్స్ కన్సార్షియం సభ్యులు ఎప్పటికప్పుడు కోవిడ్ వేరియంట్లపై పరిశోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేపీ?1 కేసులు ఎక్కువగా పశ్చిమ బెంగాల్‌లో 23 నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇక కేపీ2 కేసులు ఎక్కువగా మహారాష్ట్ర(148) నమోదైనట్లు వెల్లడించారు.ఇదిలా ఉంటే కోవిడ్ కొత్త వేరియంట్లు సింగపూర్‌లో విజృంభిస్తున్నాయి. మే 5 నుంచి 11 మధ్య కేవలం వారం వ్యవధిలో 25,900 కేసులు నమోదు కావడం వైరస్ తీవ్రతకు అద్దం పడుతోంది. భారత్‌లో ఇలాంటి పరిస్థితి ఉండదని వైద్య ఆరోగ్య శాఖ చెబుతోంది. అయినా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది

## టీడీపీ నేతలపై దాడి



కుప్పం : కుప్పం పరిధి తంబిగానిపల్లెలో 5 వార్డు లో టీడీపీ వర్గీయులపై దాడి జరిగింది. కౌన్సిలర్ సెల్వం, టీడీపీ మాజీ వార్డు మెంబర్ అశోక్ , కార్యకర్తలపై దాడికి వైసీపీ నేతలు దిగారు. వైసీపీ నేతలు సాయి కిరణ్, యమరాజ్ ,నాగరత్నం దాడి చేసినట్లు గుర్తించారు. గాయపడిన కౌన్సిలర్ సెల్వం, కార్యకర్తను ఆసుపత్రికి తరలించారు. ఎన్నికల రోజు ఘటన నేపథ్యంలో వైసీపీ నేతలు దాడికి దిగారు. టీడీపీ వార్డు మెంబర్ అశోక్ తల పై ఇనుప ర్యాడ్ తో దాడి జరిపారు.

## అంబులెన్స్ డ్రైవర్లపై దాడి..గాయాలు



రంగారెడ్డి: హైదరాబాద్ కామినేని చౌరస్తాలో దారుణం జరిగింది. అబులెన్స్ డ్రైవర్లపై కర్రలతో దాడి చేసారు. తమ వ్యాపారానికి అడ్డువస్తున్నారని న్యూ మల్టీ కార్ సిబ్బంది దౌర్జన్యం చేసారు. ప్రైవేట్ ఆస్పతులకు రోగులను షిఫ్ట్ చేసే అంబులెన్స్ లు, ట్రాఫిక్ కి ఇబ్బంది కాకుండా గత కొన్నిలుగా పార్కింగ్ చేస్తున్నారు.అక్కడ అంబులెన్స్ పార్క్ చేయొద్దు అంటూ డ్రైవర్లతో న్యూ మల్టీ కార్ ఓనర్ గొడవకు దిగాడు. అంబులెన్స్ డ్రైవర్లపై కర్రలతో దాడి చేయడంతో పలువురికి గాయాలు అయ్యాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు వారిని అడ్డుకున్నారు. గొడవను సద్దుమణిగించే ప్రయత్నంలో ట్రాఫిక్ ఎస్ఐతో వాగ్వాదాని దిగారు. గొడవలో గాయపడ్డ వారిని చికిత్స కోసం హాస్పిటల్ తరలించారుర.

## సీతారామ ప్రాజెక్టు కాలువ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం:** ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల కేంద్రంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరిశీలించారు. సీతారామ ప్రాజెక్ట్ కింద పొలాలను కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటు కు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని రైతులు మంత్రి తుమ్మలకి వినతి పత్రం ఇచ్చారు. ఆశించిన నష్టపరిహారం ఇవ్వని ఎడల మా భూములను ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు.

## ఉల్టా అయిన మోడీ.....!



ముస్లింలు ఎక్కువ మంది పిల్లలను కంటారని, వారు అక్రమ చొరబాటుదారులని, వారికి మంగళసూత్రాలు కూడా లాక్కుని పంచి పెడతారని మాట్లాడిన మోడీ నాలుక మడత పెట్టి నేను ముస్లింలని, హిందువులని మాట్లాడలేదంటూ మరోసారి బొంకారు. పైగా గోద్రా ఘటనల తర్వాత తన మీద దుష్ప్రచారం చేశారని వాపోతున్నారు. హఠాత్తుగా ఈ తెలివిడి ఎందుకు వచ్చింది? ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన రోజు నుండి తన పదవిని, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ముస్లింలు ఈ దేశానికి శత్రువులని ప్రచారం చేసింది ఎవరు? గోద్రా దాడుల్లో పార్లమెంటు మాజీ సభ్యుడు, కాంగ్రెసు నాయకుడు ఇషాన్ జాఫ్రీ%ా%మోడీకి, పోలీసు అధికారులకు, తెలిసిన నాయకులకు తమ పరిస్థితి గురించి మొత్తుకున్నా, సహాయం కోసం చివరి నిముషం వరకు ఎదురు చూసినా, ఆయనతో సహా 124 మందిని సజీవంగా తగలబెట్టారు. ముఖ్యమంత్రిగా మోడీ కనీసం సంతాపం కూడా ప్రకటించలేదే! జునైద్ 17 సంవత్సరాల బిడ్డ! నడుస్తున్న రైలు నుండి తోసేసి చంపారు. మోడీ ఏమైనా స్పందించారా? ఆయనకు చీమ కుట్టినట్లు కూడా లేదే? అఖ్లాక్ ఇంటి మీద పడి ఫ్రిజ్‌లో గో మాంసం ఉందనే సాకుతో ఆయనను చంపిన నేరస్తులకు ఉద్యోగాలిచ్చినప్పుడు హంతకులకు ఉద్యోగాలు ఎవరిచ్చారనే ప్రశ్న రాలేదే! ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! స్పందించారా? కోవిడ్ వ్యాప్తికి తబ్లిగీ జమాతే ప్రార్థనలు కారణం అంటూ విష ప్రచారాన్ని సాగించింది మోడీ ఆశీర్వాదంతో కాదా? మిస్సయింది ముగ్గురు మహిళలైతే 32,000 మహిళలు మిస్సయ్యారంటూ తీసిన 'కేరళ స్టోరీ' సినిమాని లవ్ జిహాదీ పేరిట ప్రమోట్ చేసింది మోడీ, అమిత్ షా లే కదా! ముస్లింల మీద ఎన్ని రూపాలలో ఎన్ని రకాలుగా అపోహ, విద్వేషాలను సృష్టించే యత్నం చేశారు! నాసిక్ జిల్లాలో మాలెగావ్ లోని మసీదు దగ్గర చేసిన బాంబు దాడుల్లో నేరస్తులైన సాధ్వి ప్రజ్ఞా, కల్నల్ పురోహిత్ లాంటి హిందూత్వ ఉగ్రవాదులకు అండగా నిలిచింది కూడా వీరే కదా! ఇప్పుడు ఈ నంగనాచి కబుర్లేమిటి? ముస్లిం కుటుంబాల గురించి కాదు, ప్రతి పేద కుటుంబం గురించి అంటున్నారు. ఎక్కువ సంతానానికి కారణం పేదరికం అన్న జ్ఞానం మన ప్రధానికి ఉంటే వారికి తాళిబొట్లు పెరుక్కుని పంచుతారని 'పంచులు' ఎందుకు వేసినట్లు? పేదరికం నుంచి ఉద్ధరించడానికే కదా 'లక్ దీదీ'ల గురించి మాట్లాడారు. మరి కాంగ్రెస్‌ని తాళిబొట్లు పంచుతారంటూ ఎందుకు ఎద్దేవ చేసినట్లు..! ఎక్కువ మంది పిల్లలు ఉన్నవాళ్లు అంటే ముస్లింలని అర్థం తీయడం చాలా అన్యాయమంటూ అమాయకత్వం, ఆశ్చర్యం తెగ వ్యక్తం చేస్తున్నారు. మీ పిల్లలకు ప్రభుత్వం బాధ్యత వహించాలనుకోవద్దని సుద్దులు చెప్పబూనుకున్నారు. జనాభాకు పేదరికానికి అంతర్గత సంబంధం ఉన్నదని, అందుకు పేదరికాన్ని తొలిగించాలని కదా నిపుణులు చెప్తున్నారు. అందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలా? లేదా? అక్షరాశ్యత పెరిగిన చోట ఆ కుటుంబాలు కూడా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నాయి కదా. మరి నిరక్షరాస్యతను తొలగిం చాల్సిన బాధ్యత ఎవరిది? పిల్లలను ఎక్కువ కంటున్నారని ఎవరిని దూషిస్తున్నట్లు! 'చొరబాటు దారులు' అన్నది ఎవరిని? దాడుల్లో సర్వ నాశనం అయిన ప్రజలకు కనీస సౌకర్యాల కోసం అడిగితే ఏమన్నారు ఈ మోడీ! పరాయివారిగా సృష్టించి పారదోలే పన్నాగాలు, బానిసల్లా పడి ఉండాలన్న నిరంకుశ పెత్తందారీ లక్షణాలు కావా? మోడీ వాచాలతను, తెంపరితనాన్ని, విద్వేష ప్రచారాన్ని నలు వైపులా ప్రశ్నించడంతో ఇప్పుడు మోడీ ఉల్టా అవడం కాదా! లేదు, లేదు నా ఉద్దేశం అది కాదంటూ ఇచ్చే వివరణ నష్ట నివారణ కోసమా? ముస్లిం కుటుంబాలతో ఆయన అనుబంధం గురించి ఊరించి చెప్తున్నారు. ఈద్ పండుగ కూడా జరుపుకుంటామని రంగులద్దుతున్నారు. ఇంటి పక్కన ఉన్న ముస్లిం స్నేహితులు పంపే భోజనాలతో ఇంట్లో వంటే లేదని చెప్పుకుంటున్నారు. హలాల్ చేసిన మాంసాన్ని అమ్మడం మీద, కొనడం మీద దుష్ప్రచారం చేస్తున్నదెవరో? మొహరం రోజు త్యాగాల గాథలను కూడా విన్నారట! అంత స్నేహంతోనేనా ముస్లింల ప్రాణాలను, ఆడబిడ్డల మానాలను హరించి దోషులను రక్షించింది? గోద్రా దాడుల్లో హత్యగావించబడిన వారి గురించి ఏమన్నారు? కారు కింద కుక్క పిల్ల పడ్తే పట్టించుకుంటామా అని కదా మాట్లాడారు.

## జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సింది మనమే...!



సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి అధికం కాదు, ఏదీ తక్కువ కాదు. అన్ని సమానమే! ప్రతీది ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుంటాయి. మనిషి సైతం తన ప్రతి అవసరానికి ప్రకృతి మీద ఆధారపడతాడు.ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. ఇది గమనించిన భారతీయ ఋషులు జీవవైవిధ్య చక్రం సక్రమంగా సాగేలా, మనిషి వాటిలో కల్పించుకునే వీలు లేకుండా మానవ ధర్మాలను వివరించారు. భూమిపై జీవాల మధ్య భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటాం. నేడు మన భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవవైవిధ్యం సుమారు 3.5 బిలియన్‌సంవత్సరాల పరిణామం. మన జీవనశైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఎన్నో జీవ జాతులు అంతరించిపోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవవైవిధ్య ప్రాంతాల్లో మన దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు మనదేశంలో ఉన్నాయి. కానీ ఇదంతా గతం. నేడు ఆ విస్తారమైన జీవ సంపదలో 10 శాతానికి పైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాల్లో 50 శాతానికిపైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు లుప్త మైపోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను మన జీవనశైలితో రూపుమాపేశాము. సముద్రతీరాలు అతలాకుతలం చేసేశాము. ఇవన్నీ చాలవన్నట్టు అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి కొందరు అంతమొందిస్తున్నారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణారహితంగా వాడేలా చేసింది. దీంతో మన నేలను, దానిపై నివసించే విలువైన జీవ సంపదను కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాదు అపార జీవ జాతులు అంతరించిపోయాయి. మన దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండ జాతి ప్రజలు) ఎక్కడున్నారో అక్కడ జీవవైవిధ్యం ఎక్కువగాను, పదిలంగానూ ఉంది. అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికం. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యుమార్పిడి వల్ల వచ్చే ప్రభావాలు స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్యయనం చేయకుండా వీటిని ఏ జీవజాతుల్లోనూ ప్రవేశపెట్టకూడదు. తొందరపడితే ప్రస్తుతం మనుగడలోని జీవజాతికే ప్రమాదం వాటిల్లుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. సుందర్‌లాల్ బహుగుణ నిర్వహించిన చిప్కో ఉద్యమం, పర్యావరణ పరిరక్షణకు సాగిన ఉద్యమాలన్నింటికీ తలమానికమైనది.

# తక్కువ ప్రమాదకరమైన సరీసృపాలు......!

ప్రతి సంవత్సరం మే 23న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ తాబేలు దినోత్సవం నిర్వహించ బడుతుంది. తాబేళ్ళ మనుగడపై మానవ దృష్టి సారించడానికి, వాటిని సంరక్షించేలా ప్రోత్సహించడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. 1990 లో స్థాపించబడిన లాభాపేక్షలేని సంస్థ అయిన అమెరికన్ తాబేలు రెస్క్యూ (%రూ=%) ప్రపంచ తాబేలు దినోత్సవ వేడుకలకు స్పాన్సర్ చేస్తుంది. "తాబేళ్లను కాపాడుదాం...ప్రపంచ తాబేలు దినోత్సవ అవగాహనను ప్రపంచమంతా పంచుకుందాం" నినాదంతో కార్యక్రమాలను చేపడుతుంది. ప్రపంచంలోని పురాతన జీవుల పట్ల జ్ఞానాన్ని పెంచడానికి, ఉన్న జాతులను. కాపాడడానికి ప్రపంచ తాబేలు దినోత్సవం ప్రారంభించ బడింది. తాబేళు పెంపుడు జంతువులుగా కాకుండా వన్యప్రాణులు అనే భావనను వ్యాప్తి చేస్తూ, ప్రపంచ వ్యాప్తంగా తాబేళ్ల పట్ల కారుణ్యం, తాబేళ్ళలో అక్రమ వ్యాపారాన్ని నిలువరించడం...అంతిమ లక్ష్యంగా తాబేలు దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. మొట్టమొదటి తాబేళ్లు 300 మిలియన్ సంవత్సరాల క్రితం బల్లులు, పాముల కన్నా మొసళ్ళు, పక్షులకు దగ్గరి సంబంధం ఉన్న సరీసృపాల సమూహం నుండి విడిపోయి పరిణామం చెందినట్లు చెపుతారు. అప్పటి నుండి అనేక తాబేలు జాతులు మనుగడ సాగించాయి. అయితే ఆహార పరిశ్రమ, నివాస విధ్వంసం, గ్లోబల్ వార్మింగ్ మరియు క్రూరమైన పెంపుడు జంతువుల వ్యాపారం ఫలితంగా వేగంగా కనుమరుగు అవుతున్నాయి. తాబేలు లేదా కూర్మము మహా విష్ణువు యొక్క అవతారంగా పురాణాలు పేర్కొన్నాయి. ఇవి దృఢమైన పైకప్పుగల ప్రాచీన సరీసృపాలు. ఇవి ట్రయాసిక్ యుగం నుంచి ఎలాంటి మార్పులు లేకుండా జీవించి ఉన్న జీవులు. వీటిని అతి ఎక్కువ జీవిత కాలాన్ని కలిగియున్న జీవులుగా భావిస్తారు. తాబేలు గుడ్లలో విటమిన్లు, ఖనిజాలు, పచ్చసొనలో చర్మం అందానికి కారణమైన విటమిన్ ఇ మరియు దృష్టికి అవసరమైన విటమిన్ ఎ ఉన్నాయి. ఈ ఆహారంలో విటమిన్ డి పెద్దలలో బోలు ఎముకల వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుడ్లలో బి విటమిన్లు ఉన్నాయి, ఇవి మొత్తం శరీర కార్యకలాపాలపై, ప్రధానంగా నాడీ వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. ఈ ఉత్పత్తి హృదయనాళ వ్యవస్థ కార్యకలాపాలను సాధారణీకరించే, జుట్టు, గోర్లు, దంతాలను మెరుగు పరిచే ఇతర ప్రయోజన కరమైన పదార్థాలను కలిగి ఉంటుంది. ఖనిజాల విషయాని కొస్తే, తాబేలు గుడ్లలో ఇనుము ఉంటుంది, ఇది రక్తం ఏర్పడటాన్ని ప్రోత్సహిస్తుంది. రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ ఆహారంలో మెగ్నీషియం కూడా ఉంది, ఇది గుండె కండరాల చర్యను మెరుగు పరుస్తుంది. కాల్షియం ఉండటం వల్ల ఎముక కణజాలం బలపడుతుంది. సాధారణ వాడకంతో, జీవక్రియ ప్రక్రియలు, జ్ఞాపకశక్తి, పనితీరు, మొత్తం జీవి యొక్క స్వరం మెరుగు పడతాయి. తాబేళ్ల గుడ్లలో లభించే ప్రోటీన్, కణాల పునరుద్ధరణను మెరుగు పరుస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. రేడియేషన్ థెరపీ తర్వాత లేదా పెద్ద మొత్తంలో రేడియేషన్ తీసుకున్నపుడు తాబేలు ఆహారం అవసరమని చెపుతారు. రక్త ప్రసరణ, అలసట, మానసిక రుగ్మతల సమస్యల విషయంలో ఇవి వాడటం మంచిదంటారు. న్యూక్లియర్ పవర్ ప్లాంట్లలో ప్రమాదాల లిక్విడేషన్ ఫలితంగా, లేదా క్రమం తప్పకుండా సంబంధం ఉన్న రేడియేషన్ మోతాదును స్వీకరించే ఫలితంగా, రేడియేషన్ ఎక్స్పోజర్ పొందిన వ్యక్తులలో...రేడియేషన్ అనారోగ్యం పరిణామాలతో పోరాడటానికి గుడ్ల యొక్క నిర్దిష్ట కూర్పు సహాయ పడుతుంది. గుడ్డు పదార్థాల ప్రధాన చర్య రోగనిరోధక శక్తిని పెంచడం, ఎముక మజ్జ యొక్క పనిని ఉత్తేజ పరచడం, ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు కారణ మవుతుంది. పక్షి గుడ్ల కన్నా తాబేళ్ల గుడ్లలో పచ్చసొన ఎక్కువగా ఉంటుంది. ఒక తాబేలు గుడ్డులో 10 గ్రా ప్రోటీన్, 12 గ్రా కొవ్వు, 0.8 గ్రా కార్బోహైడ్రేట్లు, 70 గ్రా నీరు, 1.5 గ్రా బూడిద ఉంటుంది. పచ్చసొనలో విటమిన్లు ఇ, గ్రూపులు బి, ఎ, డి ఉంటాయి. మలేషియా వంటకాల్లో, తాబేలు గుడ్లు సాంప్రదాయ జాతీయ వంటకం. అట్లాంటిక్ మహా సముద్రం ద్వీపాలలో, స్థానికులు వెదురు ఆకులతో చుట్టబడిన గుడ్లను తిని మంటల మీద కాల్చుకు తింటారు. కొన్ని తీరప్రాంత తెగలు తాబేలు గుడ్డు నూనెను కరిగించి, ఆ తరువాత, ఆహారం కోసం ఉపయోగిస్తాయి. క్యూబా, శ్రీలంక, మలేషియాలో తాబేలు గుడ్డు వంటకాలు జాతీయంగా ఉన్నాయి. నిప్పు మీద వెదురులో కాల్చిన గుడ్లు, ఆమ్లెట్లు, సూప్లు కాల్చిన వస్తువులను తయారు చేయడంలో తాబేళ్లను విరివిగా వాడతారు. ఆహారం లేకుండా మాత్రమే కాకుండా, తాబేళ్లు నీరు లేకుండా కూడా చాలా కాలం జీవించ గలవు. వివిధ జాతుల తాబేళ్ల ఆయుర్దాయం ఒకదాని కొకటి భిన్నంగా ఉంటుంది. మారియన్ అనే తాబేలు 152 సంవత్సరాల వయస్సు వరకు, కొన్ని జాతులు అనుకూలమైన పరిస్థితులలో, 200 మరియు 300 సంవత్సరాల వరకు జీవించ గలుగుతాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా 300 జాతుల తాబేళ్ల ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. తాబేళ్లు మానవులకు అతి తక్కువ ప్రమాదకరమైన సరీసృపాలు. వీటిలో కొన్నింటిని ఇళ్లల్లో పెంచు కోవచ్చు. ఎంచుకున్న రకానికి సంరక్షణ, ఎలాంటి ఆహారం అవసరమో తెలుసుకొని, పోషించు కోవచ్చు. పక్షి గుడ్ల కన్నా తాబేళ్ల గుడ్లలో పచ్చసొన ఎక్కువగా ఉంటుంది. ఒక తాబేలు గుడ్డులో 10 గ్రా ప్రోటీన్, 12 గ్రా కొవ్వు, 0.8 గ్రా కార్బోహైడ్రేట్లు, 70 గ్రా నీరు, 1.5 గ్రా బూడిద ఉంటుంది. పచ్చసొనలో విటమిన్లు ఇ, గ్రూపులు బి, ఎ, డి ఉంటాయి. వివిధ జాతుల తాబేళ్ల ఆయుర్దాయం ఒకదాని కొకటి భిన్నంగా ఉంటుంది. మారియన్ అనే తాబేలు 152 సంవత్సరాల వయస్సు వరకు, కొన్ని జాతులు అనుకూలమైన పరిస్థితులలో, 200 మరియు 300 సంవత్సరాల వరకు జీవించ గలుగుతాయి.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి



అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మరణించగా..మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటు చేసుకోగా..అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రీయా, అన్వీ శర్మ, రిత్విక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియలు అక్కడికక్కడే మరణించగా..అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థులంతా 18ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కాగా, గత నెల అరిజోనాలోని లేక్ ప్లెసెంట్ సమీపంలో పలు వాహనాలు ఢీకొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ఇద్దరు భారతీయ విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే.

# ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రజలు ఛీకొడుతున్నారు..........!



న్యూఢిల్లీ : మతోన్మాద ఆర్ఎస్ఎస్ను, దాని రాజకీయ వేదిక అయిన బిజెపిని ప్రజలే ఛీకొడుతున్నారని, వాటికి వ్యతిరేకంగా ధీరోదాత్తంగా పోరాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రముఖ వార్తా సంస్థ పిటిఐకి మంగళవారం నాడు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. ఆ వివరాలు.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు పోరాడుతున్నారని, అందుకే వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని ఖర్గే అన్నారు. రామాలయం, హిందూ-ముస్లిం విభజన, భారత్-పాకిస్థాన్ మధ్య ఘర్షణల పేరుతో బిజెపి పదేపదే ప్రజలను భావోద్వేగ ప్రచారాలతో మోసం చేస్తోందని గుర్తు చేశారు. అయితే ఈ దఫా ఎన్నికల్లో ప్రజలు బిజెపి అసలు రంగును అర్థం చేసుకున్నారని తెలిపారు.

ఇండియా ఫోరానికి సానుకూల ఫలితాలు రాబోతున్నాయని చెప్పారు. ఇండియా ఫోరానికి ఈ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు వస్తాయన్నారు. బిజెపి ఈసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని, ప్రతిపక్షాల ఐక్య వేదికగా తమ ఫోరానికి మద్దతుగా ప్రజలు పోరాడుతున్నారని తెలిపారు. ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రధాన అంశాలుగా మారాయని ఖర్గే ఆరోపించారు.

# తమిళ ప్రజలను అవమానించడమే...!




చెన్నై: ఒడిశాలోని పూరీ జగన్నాథుడి ఆలయంలో ఉన్న రత్న భాండాగారం తాళం చెవులు కనిపించడం లేదంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యల పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తాళాలు ఒడిశా నుంచి తమిళనాడుకు చేరుకున్నాయని మోడీ ఆరోపించడం తమిళ ప్రజలను అవమానించడమేనని స్టాలిన్ తప్పుబట్టారు. 'ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో పర్యటించిన మోడీ.. ఓట్ల కోసం తమిళనాడు ప్రజలను పొగిడారు. కానీ, రత్న భాండాగారం తాళం చెవులు తమిళనాడుకు చేరుకున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన వ్యాఖ్యలు అటు పూరిజగన్నాథుడిని, ఇటు తమిళ ప్రజలను కించపరిచేలా ఉన్నాయి. ఆయన ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారు. కేవలం ఓట్లు పొందేందుకే ప్రధాని ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఆయన వైఖరిని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఆలయంలోని నిధిని తస్కరించారని తమిళ ప్రజలను ఉద్దేశిస్తూ ప్రధాని ఎలా మాట్లాడతారని ఆయన నిలదీశారు. మోడీ ఇలాంటి వ్యాఖ్యలతో మొత్తం తమిళనాడును అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ నాయకుడంటే రాష్ట్ర ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రయత్నించాలే కానీ, ఇలాంటి విద్వేషపూరిత ప్రసంగాలతో శత్రుత్వాన్ని సృష్టించేలా కాదని హితవు పలికారు. అసలు ఆయనకు తమిళులపై ఇంత ద్వేషం ఎందుకు? ఇకనైనా ఓట్ల కోసం రాష్ట్ర ప్రజలను కించపరచడం మానుకోవాలని స్టాలిన్ హితవు పలికారు.

# 200 మందిని రిస్క్లో పడేసిన హెచ్ఐవీ బాధితురాలు




అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో 200 మందిని రిస్క్లో పడేసింది హెచ్ఐవీ బాధితురాలు. తన ద్వారా హెచ్ఐవీ మిగతా వారికి అంటుతుందని తెలిసిన ఏకంగా 200 మందికి పైగా పురుషులతో శృంగారం చేసింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. బాధితులను అప్రమత్తం చేయడానికి హెల్త్ అలర్ట్ ప్రకటించారు. ఈ ఘటనపై అక్కడి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓహియోలోని మరియెట్టాకు చెందిన లిండా లెచెసే అనే సెక్స్ వర్కర్ కు 2022 లో హెచ్ఐవీ సోకింది. వైద్య పరీక్షల్లో పాజిటివ్ రావడంతో తన పనికి స్వస్తి పలకాల్సిన లిండా అలా చేయలేదు. మరింత మందితో శృంగారంలో పాల్గొంటూ వచ్చింది. 2022 నుంచి ఇప్పటి వరకు 211 మందితో సన్నిహితంగా గడిపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో లిండాను అరెస్టు చేసిన పోలీసులు.. ఆమె కస్టమర్లు 211 మందికి ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లిండాకు హెచ్ఐవీ ఉందని బయటపడడంతో గతంలో ఆమెతో గడిపిన వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు.

# పశ్చిమ దేశాల్లో ఆందోళనకు కారణమేంటి..?



చైనా ప్రపంచ ఆధిపత్యం కోసం తాను చెయ్యని ప్రయత్నం అంటూ లేదు. ఎప్పుడు ఏదో ఒక దేశాన్ని గెలకడమే డ్రాగన్ పనిగా పెట్టుకుంటుంది. ఇప్పటికే పసిఫిక్ మహాసముద్రంలో చైనా అమెరికా,పశ్చిమదేశాల ఆధిపత్యాన్ని సవాల్ చేస్తుంటుంది. సౌత్ సీలో తన సరిహద్దు దేశాలనూ తన మిలటరీ పవర్ తో భయపెడుతోంది. భారత్,ఫిలిప్పీన్స్, తైవాన్,జపాన్,ఆస్ట్రేలియా, మంగోలియా దేశాలకు డ్రాగన్ వ్యవహారం నచ్చడం లేదు. చైనా తీరుపై ఇప్పటికే ఇండియా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఎప్పటికప్పుడు హిందూ మహాసముద్రంలో మిలటరీ పరంగా ఆ దేశానికి చెక్ పెడుతూ..వస్తోంది. ఈ నేపథ్యంలోనే డ్రాగన్ ను కంట్రోల్ చేసేందుకు అమెరికా,పశ్చిమ యూరప్ దేశాలు చాన్నాళ్లుగా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. చైనా దేశానికి సంబంధించిన సంస్థలు ఆఫ్రికా,ఆసియా,దక్షిణ అమెరికా,యూరప్ ఖండాల్లో భారీ ఎత్తున పెట్టుబడులు కూడా పెట్టాయి. ఇలాంటి వ్యవహారాలు అమెరికా ఆధిపత్యాన్ని ప్రపంచ వేదికపై సవాల్ చేసినట్లు అవుతుంది.

# రైసికి కన్నీటి వీడ్కోలు తబ్రీజ్లో లక్షలాది మంది నివాళి...



తబ్రీజ్ : ప్రియతమ నేతను కడసారి వీక్షించేందుకు లక్షలాది మంది ఇరానీయన్లు తబ్రీజ్కు పోటెత్తారు. ఆదివారం హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన ఇరాన్ అధ్యక్షులు ఇబ్రహీం రైసీ అంతిమ యాత్ర మంగళవారం ప్రారంభమయింది. తూర్పు అజర్బైజాన్ ప్రావిన్స్ రాజధాని తబ్రీజ్లో ప్రారంభమైన ఈ యాత్రలో తమ అభిమాన నేత కడసారి చూపు కోసం లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. అధ్యక్షుడి చిత్రాలను, ఇరాన్ జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. తబ్రీజ్ సెంట్రల్ స్క్వేర్ నుంచి యాత్ర సాగింది. ఇరాన్లో ఇతర నగరాల్లో కూడా రైసీ అంతిమ యాత్ర జరగనుంది. తబ్రీజ్ తరువాత ఇరాన్లో మతపరంగా ముఖ్య పట్టణమైన కోమ్లో రైసీ అంతిమ యాత్ర సాగింది. బుధవారం దేశ రాజధాని టెహ్రాన్లో భారీ ఎత్తున అంతిమ యాత్ర నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే ప్రార్థనలకు సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నేతృత్వం వహించనున్నారు. దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు కూడా పాల్గనున్నారు. రైసీ అంత్యక్రియలను అతను పుట్టి పెరిగిన, ఇరాన్లో రెండో అతి పెద్ద పట్టణం మసాద్లో గురువారం నిర్వహించనున్నారు. కాగా హెలికాప్టర్ ప్రమాదంపై విచారణ కొనసాగుతున్నట్లు ఇరాన్ అధికారులు తెలిపారు.

# బెల్లం, పెరుగు కలిపి తింటున్నారా.....?



కొందరు డిఫరెంట్ డిఫరెంట్ టేస్టులను ఇష్టపడుతుంటారు. టీ తో పాటు కొందరు బిస్కెట్లు తింటే కొందరు ఏకంగా స్వీట్లు కూడా తింటారు. స్వీట్ టీ కాంబినేషన్ మీకు నచ్చుతుందా? కానీ కొందరికి ఈ కాంబో చాలా ఇష్టం. ఇదిలా ఉంటే కొందరికి పెరుగు బెల్లం కాంబినేషన్ ఇష్టం. దీని వల్ల ప్రయోజనాలు కూడా మెండేనండోయ్..బెల్లం, పెరుగులో దాగివున్న పోషకాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోవడమే కాదు ఇప్పుడే తినాలి అనుకుంటారు. ఈ రెండింటి కలయిక రక్తహీనత సమస్యకు చెక్ పెడుతుంది. ఈ కాంబినేషన్ ఇమ్యూనిటి పవర్‌ను పెంచేందుకు అద్భుతంగా పనిచేస్తుంది. ఆరోగ్యానికి అవసరమైన అనేక వ్యాధుల నుంచి శరీరానికి ఉపశమనం కలిగిస్తుంది. ఇక బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయనేది తెలిసిందే. ఇది ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఫాస్పరస్‌ల మిశ్రమం. మీరు ఒకవేల రోగనిరోధక శక్తి లేక బలహీనంగా ఉంటే, మీరు తరచుగా అనారోగ్యంతో బాధపడుతున్నా.. పెరుగు, బెల్లం తీసుకుంటే చాలు. రోగనిరోధక శక్తి ఇట్టే వస్తుంది.. జలుబు, దగ్గు వంటి వ్యాధులను నివారిస్తుంది ఈ కాంబినేషన్.మీరు రక్తహీనతతో బాధపడుతుంటే పెరుగు, బెల్లం కలిపి రోజూ తింటే శరీరంలో రక్తం పెరిగి రక్తహీనత సమస్య దూరమవుతుంది. జీర్ణవ్యవస్థ సరిగా పని చేయనప్పుడు మలబద్ధకం, కడుపు ఉబ్బరం, వాంతులు వంటి సమస్యలు సర్వసాధారణంగా వస్తుంటాయి. పెరుగు, బెల్లం రోజూ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ కూడా మెరుగుపడుతుంది అంటారు నిపుణులు. బరువు ఎక్కువ ఉన్న వారు కూడా మీ రోజువారీ ఆహారంలో పెరుగు, బెల్లం కలుపుకుని తినటం మంచిది. పెరుగు బెల్లం కలిపి తింటే కడుపు ఫుల్ గా ఉన్న ఫీలింగ్ వస్తుంది. దీని వల్ల మీకు ఆకలి కూడా వేయదు. అందుకే బరువు పెరిగే అవకాశం కూడా చాలా తక్కువే ఉంటుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే..పెరుగులో బెల్లం కలిపి తీసుకోవడం వల్ల మహిళలకు పీరియడ్స్ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతేకాదు పీరియడ్స్ సమయంలో దీన్ని తినడం వల్ల కడుపు తిమ్మిర్ల నుంచి కూడా దూరంగా ఉండవచ్చు.


# ఒక్కసారిగా మద్యం మానేస్తే......!

మద్యానికి అలవాటు పడ్డవారు అకస్మాత్తుగా తాగడం మానేస్తే వారి శరీరంలో పలు మార్పులు సంభవిస్తాయని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న మద్యం ధరల కంటే శరీరం మీద మద్యం చూపించే ప్రభావం చాలా ఎక్కువ. మద్యం వల్ల అనారోగ్యానికి గురైతే ఏమాత్రం ఆలోచించకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించాలి. మద్యం రోజూ తాగినా.. అప్పుడప్పుడూ తాగినా.. అది శరీరంలోని కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. మద్యం తాగిన తర్వాత అది నేరుగా పొట్టలోకి వెళ్లి మూత్రం రూపంలో శరీరాన్ని వదిలి వెళుతుందని చాలా మంది భావిస్తారు. అది శరీరంలోకి వెళ్లిన తర్వాత అవయవాల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై చాలా మందికి అవగాహన ఉండదు. ఆల్కహాల్ తాగిన తర్వాత అది పొట్టలోని చిన్న పేగులోకి వెళుతుంది. అక్కడ అది అల్డిహైడ్స్ అనే రసాయనంగా విడిపోతుంది. పొట్ట, పేగుల్లోని రక్తం లివర్ ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు చేరుకుంది. కాలేయం మనం తిన్న ఆహారంలో పోషకాలను వేరు చేసి రక్తంలో కలిపి, ఆ రక్తాన్ని శరీరంలోని ఇతర భాగాలకు సరఫరా చేస్తుంది. అలాగే ఆహారంలో పనికిరాని వాటిని వేరు చేసి మలం, మూత్రం రూపాల్లో బయటకు పంపిస్తుంది. అల్డిహైడ్ చాలా ప్రమాదకరమైనది. ఇది రక్తం ద్వారా కాలేయానికి చేరుకుని కాలేయాన్ని దెబ్బ తీస్తుంది. అందుకే మీరు తక్కువ కాలంలో ఎక్కువ ఆల్కహాల్ తాగితే శరీరంలో అల్డిహైడ్ల పరిమాణం పెరుగుతుంది. దీంతో కాలేయం పని చేయడం ఆపేస్తుంది. మద్యం తాగడం వల్ల మానసికంగా, శారీరకంగా ప్రభావం పడుతుంది. అయితే అకస్మాత్తుగా



మద్యం మానేయడం వల్ల కొంతమందిలో తీవ్రమైన సమస్యలు కనిపిస్తాయి. దీన్ని విత్‌డ్రాయల్ సిండ్రోమ్ అంటారు. మద్యం హఠాత్తుగా మానేసిన తర్వాత కొంతమందిలో టెన్షన్, ప్రకంపనలు, అలసట కనిపిస్తాయి.

# డయాబెటిక్ పేషెంట్లకు అలర్ట్.....



కొబ్బరి నీళ్ళు తాగడం ఆరోగ్యానికి మంచిదని వైద్య నిపుణులు ఎల్లప్పుడూ చెబుతుంటారు.. ఎందుకంటే ఇది సహజమైన పానీయం.. టెట్రాప్యాక్‌లు లేదా సీసాలలో ప్యాక్ చేసిన జ్యూస్‌లు..శీతల పానీయాల కంటే ఇది చాలా మంచిది. గ్రామాలతో పాటు నగరాల్లోనూ దీన్ని ఎంతో ఇష్టంగా తీసుకుంటారు. ఇవే కాకుండా సముద్ర తీరానికి విహారయాత్రకు వెళ్లినప్పుడల్లా ఈ డ్రింక్ తాగుతుంటారు.. లేత లేదా ముదురు కొబ్బరి నీరు మనల్ని హైడ్రేట్ చేసి తక్షణ శక్తిని ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు..అయితే మధుమేహ రోగులు కూడా కొబ్బరి నీటిని తాగవచ్చా? లేదా..? అనే సందేహం తరచూ తలెత్తుతుంటుంది. కొబ్బరి నీళ్లలో సహజమైన చక్కెర ఉంటుంది.. కొంచెం తీపిగా ఉంటుంది కాబట్టి, డయాబెటిక్ పేషెంట్లు దీనిని తాగడానికి ఎప్పుడూ భయపడిపోతుంటారు. అయితే.. షుగర్ పేషెంట్లు కొబ్బరి నీరు తాగితే ఏమవుతుంది..? మంచిదా..కాదా..? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. డైటీషియన్ల ప్రకారం.. పాల కంటే కొబ్బరి నీటిలో ఎక్కువ పోషకాలు లభిస్తాయి. ఇందులోని కొవ్వు పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది.. క్రమం తప్పకుండా తీసుకునే వ్యక్తులు వారి శరీరంలో పొటాషియం, సోడియం, కాల్షియం, మెగ్నీషియం.. యాంటీఆక్సిడెంట్లను పొందుతారు. లేత కొబ్బరి నీరు త్రాగడం ద్వారా, శరీరం నుండి టాక్సిన్స్ తొలగిపోతాయి.. ఇది అనేక వ్యాధుల ప్రమాదాన్ని నివారిస్తుంది. డయాబెటిక్ పేషెంట్లు కొబ్బరినీళ్లు తాగవచ్చని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ సహజ పానీయాన్ని ప్రతిరోజూ తాగితే.. ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు. గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తక్కువగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. లేత కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీళ్లను తాగడం వల్ల శరీరంలో నీటి లోపం తొలగిపోయి అద్భుతమైన శక్తిని కూడా అందిస్తుంది.

## ఎండాకాలం పాలు తాగితే..!



పాలు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. శరీరానికి ఎంతో ముఖ్యమైన అనేక రకాల పోషకాలు పాలలో ఉంటాయి. పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా పాలు తాగడం వల్ల ఎముకలకు బలాన్ని ఇస్తాయని చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు వింటూనే ఉంటాం. అయితే వేసవిలో పాలు తాగితే పొట్టకు వేడి చేస్తుందని, ఎండాకాలంలో పాలు తాగడం పూర్తిగా మానేసేవాళ్ళు కొందరు ఉంటారు. ఈ రోజు మనం వేసవిలో పాలు తాగడానికి సరైన మార్గం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, కడుపులో ఎసిడిటీని కలిగించే అవకాశం ఉన్నందున, ఖాళీ కడుపుతో పాలు ఎప్పుడూ తాగకూడదు.

# నేరేడు పండ్ల ప్రయోజనాలు..!



వేసవి ముగింపు దశకు చేరుకుంది. ఈ క్రమంలో అప్పుడప్పుడు చిరుజల్లులు పడుతూ కాస్త చల్లదనాన్ని కలిగిస్తాయి. ఈ సమయంలో కొన్ని సీజనల్ ఫ్రూట్స్ మార్కెట్‌లో అందుబాటులోకి వస్తుంది.అవి తినడం వల్ల మానవ శరీరానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. కానీ కొందరు ఏదైనా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తినడానికి సంకోచిస్తుంటారు. అయితే మే, జూన్, జూలై నెలల్లో మార్కెట్‌లో ఎక్కడ చూసినా నల్లగా నిగనిగలాడుతూ నేరేడు పండ్లు దర్శనమిస్తుంటాయి. వాటిని బ్లాక్ బెర్రీ అని పిలుస్తుంటారు. కానీ ఆ పేరు ఎక్కువ మందికి తెలియదు కాబట్టి నేరేడు పండ్లు అంటేనే తొందరగా గుర్తొస్తుంటాయి. తీపి, వగరు కలిపి వెరైటీ టేస్‌తో ఉండే నేరేడు పండ్లు ఆరోగ్యానికి చాలా లాభాలను కలిగిస్తాయి. కానీ కొందరు వగరుగా ఉంటాయని తినడానికి పెద్దగా ఇష్టపడరు. అయితే నేరేడు పండ్లు తినడం వల్ల చాలా రకాలు ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే ప్రోటీన్, కార్బొహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం, ఫాస్పరస్, సోడియం, విటమిన్ సీ, థయామిన్, పొటాషియం రైబోఫ్లేవిన్, విటమిన్ బీ 6, విటమిన్ ఏ, అనేక వ్యాధులను తగ్గిస్తాయి. నేరేడు పండ్లు యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌లో పోరాడి క్యాన్సర్ కణాలను వృద్ధి చెందకుండా అడ్డుకుంటాయి. అలాగే శ్వాస నాళాలు, ఊపిరితిత్తులను శుభ్రపరిచి పలు సమస్యలు రాకుండా కాపాడుతాయి.


# నువ్వుల నూనె ప్రయోజనాలు...!



నువ్వులకు వంటల్లో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. వీటితోని ప్రత్యేకమైన వంటకాలు కూడా చేస్తుంటారు. వేసవి వచ్చింది మరీ మీరు పచ్చళ్లు పిండి వంటలు అంటూ ఏమైనా స్పెషల్స్ చేశారా?మరి ఈ వంటకాలకు ఎక్కువగా ఏ నూనెను వాడుతారు?. అయినా వేరే నూనెను ఎందుకు వాడుతారు? నువ్వుల నూనె ఉంది కదా. పచ్చళ్లు అనగానే అందరికీ గుర్తొచ్చేది నువ్వుల నూనె కదా. అద్భుతమైన రుచితోపాటు, ఏడాది పాటు నిల్వ ఉండే పచ్చళ్ల కోసం నువ్వుల నూనెను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు.మన కాలంలోనే కాదు అమ్మమ్మల కాలం నుంచే ఈ నువ్వుల నూనె ఆనవాయితీగా వస్తుంది. మరీ ముఖ్యంగా ఎదిగే అమ్మాయిలకు, బాలింతలకు నువ్వులతో చేసిన వంటకాలను, పదార్థాలను తినిపిస్తుంటారు. పచ్చి బాలింత నుంచి ఆరు నెలల వరకు కూడా నువ్వుల నూనెతో వండిన ఆహారాలను అందిస్తారు. అంటే ఏ రేంజ్ లో నువ్వుల నూనెకు ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోండి. ఇక పండుగలు పబ్బాలు వచ్చాయంటే నువ్వుల నూనెతో చాలా వంటకాలు చేస్తుంటారు కదా. మరి మీ ఇంట్లో కూడా ఇవే ఉపయోగిస్తారా? మరో విషయం ఏంటంటే.. ఈ నువ్వుల నూనె ఆరోగ్యానికి మాత్రమే కాదు అందానికి కూడా మెరుగైన ప్రయోజనాలను అందిస్తుందట. ఈ నువ్వులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయనే విషయం తెలిసిందే. గుండె జబ్బులు, మధుమేహం, ఆర్థరైటిస్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. ఇక ఈ నూనె సౌందర్యపోషణలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. నువ్వుల నూనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బీ, ఈ కాల్షియం, జింక్, ఐరన్, ఫాస్పరస్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి.

# రోజుకు ఎన్ని అడుగులు నడవాలి...?


నడవడం చాలా మందికి ఇష్టం. భాగస్వామితో కలిసి నడుస్తుంటే ఆ నడక మరింత హ్యాపీగా అనిపిస్తుంది కదా. ఇక ఈ నడక.. మిగతా వాటితో పోలిస్తే తేలికైన వ్యాయామం కూడా అవుతుంది.మనం వేసే ప్రతి అడుగు ఆరోగ్యదాయని అని, మన ఆయుష్షును పెంచుతుందని ఇప్పటికే ఎన్నో సార్లు ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది. ఇంతకీ ఆరోగ్యకర జీవనానికి రోజుకు ఎన్ని అడుగులు వేయాలి? అని ఎప్పుడైనా ఆలోచించారా? ఆ విషయం ఇప్పుడు తెలుసుకుందాం. ఈ విషయం కోసం దాదాపు 2.26లక్షల మందితో 17 వేర్వేరు పరిశోధనలు జరిపారు. అయితే వేసే అడుగుల సంఖ్యను బట్టి విభిన్న ప్రయోజనాలుంటాయని వివరించారు పరిశోధకులు. "రోజుకు దాదాపు 4వేల అడుగులు నడిస్తే అకాల మరణాలకు అరికట్టవచ్చుట. ఇది అల్జీమర్స్, డిమెన్షియా వ్యాధుల ముప్పును తగ్గిస్తుంది. అధికబరువు/ఊబకాయం, డయాబెటిస్ వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. 2337 అడుగులతో గుండె సంబంధిత జబ్బులతో మరణించే అవకాశాలు తగ్గుతాయి అని తెలిపింది పరిశోధన. ఇక రోజుకు వెయ్యి అడుగులు నడిస్తే గుండె జబ్బులను 15 శాతం తగ్గించవచ్చుట. 500 అడుగులు పెంచితే.. అవి ఏడు శాతం మేర తగ్గుతాయి. ఇక మరో విషయం ఏంటంటే..60 ఏళ్లు పైబడినవారు రోజుకు ఆరు వేల అడుగుల నుంచి 10 వేల అడుగులు నడిస్తే అకాల మరణాల ముప్పు 42 శాతం తగ్గుతుంది"అంటున్నారు పరిశోధకులు.





వయస్సు పెరిగిన తరగని అందం.. ప్రియాంక చోప్రా లేటెస్ట్ ఫోటో


# మే 29న రాబోతున్న అల్లు అర్జున్ 'పుష్ప 2' సెకండ్ సింగిల్




ఇటీవలే పుష్ప పుష్ప పుష్ప రాజ్ అంటూ తొలి లిరికల్ సాంగ్‌తో ప్రపంచవ్యాప్తంగా శ్రోతలను అలరించి.. యూట్యూబ్ వ్యూస్‌లో ఆల్ టైమ్ రికార్డులు నెలకొల్పిన పుష్ప–2 ది రూల్‌లోని పుష్పరాజ్ టైటిల్ సాంగ్ ఇంకా అంతటా మారుమోగుతూనే వుంది.. ప్రస్తుతం ఈ సాంగ్ ట్రెండ్‌లో ఉండగానే.. ఇప్పుడు తాజాగా మరో లిరికల్ అప్‌డేట్‌ను ఇచ్చారు పుష్ప –2 మేకర్స్.. ఈ సారి చిత్రంలోని హీరోయిన్ శ్రీవల్లి వంతు వచ్చింది. పుష్పరాజ్ జోడి అయిన శ్రీవల్లి పుష్పరాజ్‌తో కలిసి పాడుకున్న మెలోడి సాంగ్‌ను కపుల్ సాంగ్‌గా నెల 29న ఉదయం 11:07 నిమిషాలకు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను నేడు విడుదల చేశారు మేకర్స్. ప్రోమోలో కేశవ వాయిస్‌తో సెకండ్ సాంగ్ గురించి రష్మికను అడుగుతాడు. మేకప్ వేసుకునేందుకు సిద్దంగా వున్న శ్రీవల్లి సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ వుంటాడే నా సామి అంటూ ఆమె పాడుతూ ఐకానిక్ స్టెప్పుతో అలరించింది. ఈ ప్రోమో చూసి సాంగ్ అదిరిపోయే మెలోడిలా వుండబోతుందని అందరూ అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప–2 ది రూల్.

పుష్ప ది రైజ్‌తో ప్రపంచ సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. ఈ చిత్రంలో ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నటనకు, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభకు అందరూ ఫిదా అయిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరి సన్సేషనల్ కలయికలో రాబోతున్న పుష్ప–2 ది రూల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆకాశమే హద్దుగా అంచనాలు వున్నాయి. ఈ సంవత్సరం ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా విడుదల చేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక పుష్ప ది రైజ్ చిత్రంలో తన నటనతో మొట్ట మెదటిసారిగా తెలుగు కథానాయకుడు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు తీసుకోవడం, మొట్టమొదటిసారిగా దక్షిణ భారతదేశ నటుడు దుబాయ్‌లో మేడమ్ టూస్సాడ్ మ్యూజియంలో మైనపు విగ్రహం ఏర్పాటు చేయడం అనేవి తెలుగు వారందరికి గర్వకారణం. ఇలాంటి ప్రత్యేకతలు పుష్ప చిత్రంతోనే సంతరించుకున్నాయి. ఇక త్వరలోనే పుష్ప 2తో మరోక్కసారి ప్రపంచం లోని సినిమా అభిమానులంతా ఒక్కసారి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటవిశ్వరూపాన్ని చూడబోతున్నారు. 90 సంవత్సరాలు తెలుగు సినిమా చరిత్రలో మొదటిసారి తెలుగు నటుడి నటన చూసేందుకు ప్రపంచ దేశాలన్ని ఎదురుచూస్తున్నాయి.. అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంకు సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రి మూవీ మేకర్స్ అసోసియేషన్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లపై నవీన్ ఏర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. సంగీతం: దేవి శ్రీ ప్రసాద్.

# పుష్ప ది రూల్‌తో రష్మిక మందన్నా, తృప్తి డిమ్రి కాంబో రిపీట్..?





యానిమల్ సినిమాతో సూపర్ హిట్ సక్సెస్‌ను ఖాతాలో వేసుకున్నారు కన్నడ భామ రష్మిక మందన్నా, తృప్తి డిమ్రి. రణ్‌బీర్‌కపూర్ టైటిల్ రోల్‌లో నటించిన యానిమల్‌తో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ ఇద్దరు మరోసారి కలిసిసందడి చేయబోతున్నారా.. ? అంటే అవుననే అంటున్నాయి ఫిలింనగర్ సర్కిల్ కథనాలు. ఇంతకీ ఈ ఇద్దరు మళ్లీ ఏ సినిమాలో నటించబోతున్నారనే కదా మీ డౌటు. అల్లు అర్జున్ టైటిల్ రోల్ పోషిస్తున్న పుష్ప ది రూల్ సినిమాలో అదిరిపోయే స్పెషల్ సాంగ్ డిజైన్ చేశారని తెలిసిందే. ఫస్ట్ పార్టు ఐటెం సాంగ్ ఊ అంటావాలో సమంత కనిపించి సెన్సేషన్ సృష్టించింది. ఇక సీక్వెల్ పార్టులో రాబోయే ఈ పాటలో ఎవరు కనిపించబోతున్నారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సాంగ్‌లో తృప్తి డిమ్రిని తీసుకోవాలని మేకర్స్ అనుకుంటున్నట్టు వార్తలు ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ ఈ న్యూస్‌ను మాత్రం తెగ ఎంజాయ్ చేస్తున్నారు తృప్తి డిమ్రి ఫాలోవర్లు. పుష్ప ది రూల్‌లో రష్మిక మందన్నా శ్రీవల్లిగా కనిపించనుందని తెలిసిందే. ఒకవేళ తాజా కథనాలు నిజమే అయితే తృప్తి డిమ్రి, రష్మిక మందన్నా కాంబోలో మరో సినిమా రావడం ఫైనల్ అయినట్టే. మరి దీనిపై మేకర్స్ ఏదైనా అనౌన్స్‌మెంట్ చేస్తారేమో చూడాలి. ప్రస్తుతం సుకుమార్ అండ్ టీం పుష్ప ది రూల్ షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో ఫుల్ బిజీగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న సీక్వెల్ పార్టులో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నుడు.

# యక్షిణి ట్రైలర్ టైం ఫిక్స్ చేసిన బాహుబలి మేకర్స్



బాహుబలి ఫ్రాంచైజీని తెలుగు ప్రేక్షకులకు అందించిన ఆర్కా మీడియా వర్క్స్ ఇటీవలే కొత్త వెబ్ సిరీస్‌ను ప్రకటించిందని తెలిసిందే. ఈ వెబ్ సిరీస్ యక్షిణి  టైటిల్‌తో వస్తుండగా.. ఇప్పటికే టైటిల్ లుక్ పోస్టర్ కూడా విడుదల చేశారు. పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫాం డిస్నీ ప్లస్ హాట్ స్టార్ తెరకెక్కిస్తున్న యక్షిణి  మూవీని జోహార్, కోటబొమ్మాళీ పీఎస్ సినిమాలను తెరకెక్కించిన తేజ మర్ని డైరెక్ట్ చేస్తున్నాడు. యక్షిణిలో వేదిక లీడ్ రోల్‌లో నటిస్తోండగా.. మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ సిరీస్ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. సోషియా ఫాంటసీ సిరీస్ మరోసారి తెరపైకి వచ్చింది. వేదిక లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ ప్రాజెక్ట్ ట్రైలర్‌ను రేపు మధ్యాహ్నం 1:30 గంటలకు లాంఛ్ చేయనున్నారు. ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో ప్రీమియర్ డేట్‌ను ప్రకటించనున్నారట. పాన్ ఇండియా సిరీస్‌గా వస్తోన్న యక్షిణి కి సంబంధించి మరిన్ని వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్.

# థార్ కార్ల ధరలకు రెక్కలు......!

మహింద్రా థార్ కు దేశంలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ కారు అమ్మకాలలో దూసుకుపోతూ కొత్త రికార్డులు క్రియేట్ చేస్తోంది. దేశీయ తయారీ సంస్థ మహింద్రా నుంచి విడుదలైన ఈ కారు మంచి డిజైన్, అద్భుతమైన ఫీచర్లతో ఆకట్టుకుంటుంది. అయితే మార్కెట్ లోని కొన్ని థార్ బేస్ వేరియంట్ల ధరలు పెరిగాయి. పాత ధరకు రూ.10 వేల వరకూ ఎక్కువగా మారాయి. పెరిగిన మార్పులలో ఈ కారు రూ.11.35 లక్షల (ఎక్స్ షోరూమ్) ప్రారంభ ధరకు అందుబాటులో ఉంది.మహింద్రా కంపెనీ మార్కెట్లో తన బ్రాండ్ ను విస్తరించేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. లేటెస్ట్ ఫీచర్లతో వినియోగదారులకు అవసరమైన విధంగా కార్లను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ఎస్ యూవీ సిగ్మెంట్ లో ఎక్స్ యూవీ 3ఎక్స్ ఓ కారును విడుదల చేసింది. అలాగే తన ప్రసిద్ధ థార్ ధరలను సవరించింది. కొన్ని బేస్ వేరియంట్లపై రూ.10 వేలు పెంచింది. ఈ మార్పులతో ఈ కారు ధర 11.35 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. అలాగే అత్యంత ఖరీదైన వేరియంట్ రూ. 17.6 లక్షలుగా ఉంది. మహింద్రా సంస్థ ఈ కింది తెలిపిన బేస్ వేరియంట్ల ధరను రూ.పదివేలకు పెంచింది. వీటిలో ఏఎక్స్ (ఓ) డీజిల్ ఎంటీ ఆర్ డబ్ల్యూడీ, ఎల్ ఎక్స్ డీజిల్ ఎంటీ ఆర్ డబ్ల్యూడీ, ఎల్ ఎక్స్ పెట్రోల్ డబ్ల్యూడీ ఉన్నాయి. పెరిగిన ధరలతో ఇవి వరుసగా 11.35 లక్షలు, 12.85 లక్షలు, 14.1 లక్షలకు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ ఎక్స్ షోరూమ్ ధరలు. ఇతర వేరియంట్ల ధరలు మాత్రం ఎప్పటిలాగే కొనసాగుతున్నాయి. దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఎస్‌యూవీలలో మహింద్రా థార్ ఒకటి. సాధారణ వినియోగంతో పాటు ఆఫ్ రోడింగ్ చేయడానికి కూడా ఈ కారు అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్ లోని మారుతీ సుజుకీ జిమ్నీ, ఫోర్స్ గుర్కా తదితర కార్లతో పోటీ పడుతుంది. థార్ కార్లు 1 పెట్రోల్, 2 డీజిల్ ఇంజన్ ఎంపికలతో అందుబాటులోకి వచ్చాయి. 1.5 లీటర్ సీఆర్ డీఈ డీజిల్, 2.0 లీటర్ టీజీడీఐ పెట్రోల్ ఇంజన్ సామర్థ్యంతో పనిచేస్తాయి. మహింద్రా కంపెనీ మరో కొత్త ఆవిష్కరణకు సన్నాహాలు చేస్తోంది. థార్ లో ఫైవ్ డోర్ వెర్షన్ ను విడుదల చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ కొత్త ఎస్ యూవీకి ఇంకా పేరు పెట్టలేదు. అయితే మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం.. కొత్త కారుకు ఆర్మ్ డా అని పేరు పెట్టే అవకాశం ఉంది. అలాగే ఈ ఏడాది ఆగస్టు 15 న భారతీయ మార్కెట్లో విడుదల చేస్తారని భావిస్తున్నారు. కానీ దీనిపై ఇంత వరకూ మహింద్రా అధికారంగా ఏ ప్రకటనా చేయలేదు.




# ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ మంచిదేనా.....?




మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటాయి. అయినప్పటికీ అధిక రాబడి వచ్చే అవకాశాలుండటంతో వీటిల్లో పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. అయితే దీనిలో హామీతో కూడిన రాబడి మాత్రం రాదు. సాధారణంగా ఏదైనా మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడి పెట్టే ముందు పెట్టుబడి దారులు స్కీమ్-సంబంధిత పత్రాలను జాగ్రత్తగా చదవాలని నిపుణులు సూచిస్తారు. ఈ మ్యూచువల్ ఫండ్స్ లో చాలా రకాలు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిపై కనీస అవగాహన లేకుండా పెట్టుబడులు ప్రారంభించడం అంత తెలివైన నిర్ణయం కాదు. మీకు రిస్క్ శాతం తక్కువ ఉండి.. మంచి ఫ్లెక్సిబిలిటీని అందించేవి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్. ఇవి మ్యూచువల్ ఫండ్స్ లోనే ఒక రకం. ఇవి వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్‌ల కంపెనీలలో పెట్టుబడి పెట్టేందుకు మిమ్మల్ని అనుమతిస్తాయి. ఈ ఫండ్స్ నిర్దిష్ట మార్కెట్ క్యాప్ సెగ్మెంట్ (లార్జ్-క్యాప్, మిడ్-క్యాప్ లేదా స్మాల్-క్యాప్)పై దృష్టి సారించే సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్ కాకుండా, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ లార్జ్-క్యాప్, మిడ్-క్యాప్, స్మాల్-మిక్స్‌లో ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛను కలిగి ఉంటాయి. ఇది మార్కెట్ పరిస్థితులు, అవకాశాలు, వారి పెట్టుబడి వ్యూహం ఆధారంగా పోర్ట్‌ఫోలియోను డైనమిక్‌గా సర్దుబాటు చేయడానికి ఫండ్ మేనేజర్‌లకు అవకాశం ఇస్తుంది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లలో బెస్ట్ ఫీచర్ వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లలో పెట్టుబడి పెట్టడానికి అవకాశం కల్పించడమే. ఇది మార్కెట్ పనితీరు, సంభావ్య వృద్ధి అవకాశాల ఆధారంగా పెట్టుబడులను మార్చడం ద్వారా ఫండ్ మేనేజర్ రాబడిని ఆప్టిమైజ్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ లో కలిగే ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాం. అయితే ఇవి నిపుణుల ద్వారా పెట్టుబడి దారుల అవగాహన కోసం మాత్రమే అందిస్తున్నాం. సెక్టార్ రొటేషన్: ఫ్లెక్సిక్యాప్ ఫండ్‌లు వివిధ రంగాలలో వైవిధ్యభరితంగా ఉంటాయి. వీటి సాయంతో ఫండ్ మేనేజ్‌మెంట్‌లో సహజ క్రమశిక్షణలో సహాయపడే సెక్టార్ రొటేషన్‌ను చేపట్టవచ్చు. సంబంధిత సెక్టార్ ఫండ్‌లు స్థూల, వ్యాపారం, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి సంబంధిత రంగ టెయిల్‌విండ్‌ల ఆధారంగా విస్తృత మార్కెట్‌లను అధిగమించగల సామర్థ్యాన్ని కలిగి ఉండవచ్చు. వివిధ రంగాలు వేర్వేరు చక్రాల గుండా వెళతాయి. అందువల్ల సెక్టార్ ఫండ్స్ రిటర్న్స్ డైవర్సిఫైడ్ ఫండ్స్ కంటే ఎక్కువ అస్థిరతతో ఉండవచ్చు. వాల్యుయేషన్ క్రమశిక్షణ: మార్కెట్‌క్యాప్ మ్యాన్ డేట్ లేనందున ప్రతి రంగం కింద మార్కెట్ క్యాప్‌ను మరింత సౌలభ్యంతో నిర్వహించవచ్చు. లార్జ్ క్యాప్ వాల్యుయేషన్ మెరుగ్గా అనిపించినప్పుడు, ఫ్లెక్సిక్యాప్ ఫండ్‌లు లార్జ్ క్యాప్‌లపై లోడ్ అవుతాయి. అలాగే మిడ్‌క్యాప్‌లు, స్మాల్ క్యాప్‌లను ఎంపిక చేసుకుని సహేతుకమైన వాల్యుయేషన్ పాకెట్‌లను కూడా ఎంచుకోవచ్చు.భవిష్యత్తు ఆదాయాల పెరుగుదల: ఫ్లెక్సిక్యాప్ ఫండ్‌లు సెక్టార్‌ల అంతటా వైవిధ్యభరితంగా ఉన్నప్పుడు వాల్యుయేషన్ కర్వ్‌లో వైవిధ్యభరితంగా ఉండవచ్చు. ఫ్లెక్సిక్యాప్ పోర్ట్‌ఫోలియోలో స్థిరమైన ఆదాయాల స్టాక్‌లలో మంచి భాగంతో పాటుగా కొన్ని రీరేటింగ్ స్టాక్‌లు ఉండవచ్చు. వారు వాల్యుయేషన్‌లు, ఆదాయాలు నిరుత్సాహపరిచే రంగాలపై అధిక బరువుకు గురికావచ్చు. అయితే వాల్యుయేషన్‌లు విస్తరించి ఉన్న సెక్టార్‌లపై తక్కువ బరువును కలిగి ఉంటాయి.

## ఎఐతో సంపన్నులకే లబ్ధి



కృత్రిమ మేధా (ఎఐ)తో సంపన్నులకే లబ్ధి చేకూరనుందని టెక్నాలజీ నిపుణుడు, ఎఐ గాడ్ ఫాదర్‌గా గుర్తింపు పొందిన జెఫ్రీ హింటన్ అన్నారు. నూతన టెక్నాలజీ ఉత్పాదకతను పెంచి సంపదను సఅష్టించినా అది తిరిగి సంపన్నుల ఖజానాలోకే వెళ్లనుందని ఆవేదన వ్యక్తం చేశారు. జెఫ్రీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఎఐతో ప్రపంచానికి మేలు చేకూరి సంపదను సమకూర్చినప్పటికీ.. ఈ టెక్నాలజీతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి, సామాన్యులకు ఆ సంపద చెందకుండా కేవలం డబ్బున వారి చేతుల్లోకే వెళ్తుందన్నారు. ఇది సమాజానికి చాలా చేటు చేస్తుందని హెచ్చరించారు. ఎఐ వల్ల నష్టపోయిన ప్రజలకు కనీస రాబడిని ప్రభుత్వం సమకూరిస్తే వారు ఇబ్బందులకు లోనుకాకుండా చూడవచ్చని సూచించారు. ఎఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని, మానవాళి విధ్వంసానికి ఇది దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. ఎఐతో పొంచి ఉన్న ముప్పుపై జెఫ్రీ హింటన్ పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృత్రిమ మేధాతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని, దీనిపైనే తాను కలత చెందుతున్నానని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలు తమ సేవలను మరింత సులభతరం చేసుకోవడానికి, వ్యయాలను పొదుపు చేసుకోవడానికి ఎఐలను అభివృద్ధి చేసుకుంటున్నాయి. అన్ని టెక్నాలజీ కంపెనీలు ప్రస్తుతం ఎఐపైనే దృష్టి పెట్టాయి. పోటాపోటీగా ఈ సాంకేతికతను అభివృద్ధి చేయడంలో బిజీగా ఉన్నాయి.

## సొంతింటి కల నెరవేరాలా..?



సొంతిల్లు అనేది నేడు ప్రతి ఒక్కరి కల. దాన్ని నెరవేర్చుకునేందుకు ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. మీరు సంపాదించే ఆదాయం, ఖర్చులపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఆ కల సాకారం అవుతుంది. అనసవర ఖర్చులపై నియంత్రణ ఉంటే పొదుపు పెరుగుతుంది. అది కొంత కాలానికి పెద్ద మొత్తంగా మారి ప్రయోజనం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పెరిగిన తర్వాత సొంతిల్లు సమకూర్చకోవడం దాదాపు సాధ్యంగానే మారింది. వివిధ రియల్ ఎస్టేట్ కంపెనీలు అపార్టుమెంట్లను కట్టి వాటిలో ఫ్లాట్లను విక్రయిస్తున్నాయి. వాటికి బ్యాంకులు కూడా రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఆ రుణం ద్వారా ఫ్లాట్ ను సొంతం చేసుకోవచ్చు. బ్యాంకుల ప్రతినెలా ఈఎంఐ రూపంలో వాయిదాలు చెల్లించవచ్చు. ఫ్లాట్ కొనుగోలు చేయడానికి ముందుగా కొంత డబ్బును డౌన్ పేమెంట్ గా కట్టాలి. మిగిలిన దానిని బ్యాంకు రుణంగా ఇస్తుంది. డౌన్ పేమెంట్ ఎంత ఎక్కువ ఉండే అంత లాభం ఉంటుంది. వడ్డీ ఎక్కువగా చెల్లించే అవసరం ఉండదు. సాధారణంగా ఫ్లాట్ ఖరీదులో దాదాపు 20 శాతం డౌన్ పేమెంట్ గా ఉంటుంది. కాబట్టి ఆ డౌన్ పేమెంట్ కోసం సొమ్ములు పొదుపు చెయ్యాలి. కొన్ని సులభమైన పద్ధతులు పాటిస్తే అది సాధ్యమవుతుంది. ఆ పద్ధతులను ఇప్పుడు తెలుసుకుందాం. పరిశీలన.. ముందుగా మీరు సంపాదిస్తున్న ఆదాయం, మీరు చేస్తున్న ఖర్చులను పరిశీలించండి. మీకు అయ్యే ఖర్చులను లెక్కలను వేసుకోండి. వాటిలో కొన్ని ఖర్చులను తగ్గించుకుని పొదుపు పెంచుకునే చర్యలు తీసుకోండి. సక్రమమైన ఆర్థిక ప్రణాళిక వేసుకోండి. ఇప్పటికే ఉన్న రుణాలను సక్రమంగా చెల్లించండి. దాని ద్వారా మీ క్రెడిట్ స్కోర్ పెరిగి, త్వరగా రుణం మంజూరు కావడానికి దోహద పడుతుంది. నువైన ఎంపిక.. సాధారణంగా డౌన్ పేమెంట్ 20 శాతం ఉంటుంది. అయితే ఇంకా తక్కువ డౌన్ పేమెంట్‌లతో లోన్ ఆప్ష న్లు కూడా ఉన్నాయి. వాటినన్నింటినీ పరిశీలించి, మీకు అనువుగా ఉన్న దానిని ఎంపిక చేసుకోండి.

# 6 నెలల సగటే.. ఇకపై మార్కెట్ విలువ

నమోదిత కంపెనీల మార్కెట్ విలువ మదింపు విధానంలో సెబీ మార్పు చేసింది. ఇక మీదట మార్కెట్ విలువ లెక్కింపునకు ఒక్క రోజుకు బదులుగా ఆరు నెలల సగటును పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది.ఈ మేరకు నమోదు, వెల్లడి నిబంధనల్లో (ఎల్ఓడీఆర్) సెబీ సవరణ చేయనుంది. ఈ సవరణ 2024 డిసెంబరు 31 నుంచి అమల్లోకి వస్తుంది. జులై 1 నుంచి డిసెంబరు 31 వరకు సగటు మార్కెట్ విలువ ఆధారంగా, నమోదిత కంపెనీల మార్కెట్ విలువను, ర్యాంకులను నిర్ణయిస్తారు. ఇందుకు డిసెంబరు 31ను కట్-ఆఫ్ డేట్‌గా తీసుకుంటారు. డిసెంబరు 31న మార్కెట్ విలువను నిర్ధరించిన తర్వాత..సంబంధిత నిబంధనలు అమలయ్యేందుకు 3 నెలలు లేదా తదుపరి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఏది తర్వాత అయితే అప్పటి వరకు పరివర్తనా కాలంగా (ట్రాన్సిషన్ పీరియడ్) ఉంటుంది. 'ఏడాది చివరి రోజు అంటే డిసెంబరు 31న స్టాక్ ఎక్స్ఛేంజీలు జులై 1 నుంచి డిసెంబరు 31 వరకు నమోదిత కంపెనీల సగటు మార్కెట్ విలువ ఆధారంగా, ఆ కంపెనీల ర్యాంకులతో జాబితాను సిద్ధం చేయాల'ని సెబీ తెలిపింది.సందర్భం ఏదైనా గానీ బోర్డు సమావేశాల నిర్వహణకు రెండు పనిదినాలు ముందుగా సమాచారం ఇవ్వాలని సెబీ పేర్కొంది. ప్రస్తుతం




ఆర్థిక ఫలితాలు, షేర్ల బైబ్యాక్, నిధుల సమీకరణ లాంటి కొన్ని ప్రత్యేక అంశాల అజెండాపై బోర్డు సమావేశాల నిర్వహణకు 2-11 రోజుల్లోగా ముందస్తు సమాచారం ఇచ్చే వీలుంది. ఇప్పుడు ఈ కాలపరిమితిని 2 రోజులుగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) కోసం సన్నద్ధతలో ఉన్న కంపెనీలు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించే షేర్ల పరిమాణంలో ఏమైనా మార్పులు ఉంటే.. ఇష్యూ పరిమాణాన్ని రూపాయల్లో లేదా షేర్ల సంఖ్య ఆధారంగా మళ్లీ కొత్తగా ఐపీఓ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సెబీ తెలిపింది.

# ఈ బ్యాంకు క్రెడిట్ కార్డులు పనిచేయవు..!




నేటి కాలంలో చాలా మంది బ్యాంకు క్రెడిట్ కార్డులను కలిగి ఉన్నారు. కిరాణం షాపు నుంచి షాపింగ్ మాల్ వరకు వస్తువుల కొనుగోలుపై క్రెడిట్ కార్డు ఎక్కువగా యూజ్ చేస్తున్నారు. కొందరు రూపే కార్డును కూడా పొంది డెబిట్ కార్డు కంటే ఎక్కువగా వాడుతున్నారు. అయితే కొన్ని కారణాల వల్ల మే 22న క్రెడిట్ కార్డులు పనిచేయడం లేదు. రెండు బ్యాంకులకు సంబంధించిన కార్డులు పనిచేయవని బ్యాంకులు ముందే తమ ఖాతాదారులకు మెసేజ్ పంపించారు. ఇంతకీ ఏ బ్యాంకు క్రెడిట్ కార్డులో తెలుసా?బ్యాంకుల్లో ప్రముఖంగా కొనసాగుతున్న వాటిలో %ఎణఖీజ,ౘశ×ూ% బ్యాంకులు ఉన్నాయి. బ్యాంకు సెక్టార్ లో ఎస్బీఐ తరువాత హెచ్ డీఎఫ్ సీ కీలకంగా కొనసాగుతుంది. ఈ బ్యాంకులకు కోట్లాది మంది కస్టమర్లు ఉన్నాయి. వీరిలో చాలా మందికి క్రెడిట్ కార్డులు ఉన్నాయి. హెచ్ డీఎఫ్ సీతో పాటు యాక్సిస్ బ్యాంకూ కొన్ని వ్యవహారాల్లో కీలకంగా ఉంటోంది. ఈ బ్యాంకు కార్డుల ద్వారా నేరుగా షాపింగ్ మాల్స్ లోనే కాకుండా ఆన్ లైన్ లోనూ ట్రాన్సాక్షన్ కు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఈ కార్డుల ద్వారా వివిధ ఆఫర్లు వర్తిస్తాయి.

## విడుదలకు ముందే లీకైన 'అల్ట్రోజ్' పిక్స్....




టాటా కంపెనీకి చెందిన ఇప్పటికే చాలా మోడళ్లు వినియోగదారులను ఆకర్షించాయి. లేటెస్ట్ గా టాటా కంపెనీ నుంచి ఆల్ట్రోజ్ రేసర్ త్వరలో రిలీజ్ రిలీజ్ కాబోతుంది.దీనిని ఇటీవలే టెస్ట్ చేశారు. అయితే ఇంకా విడుదలకు సమయం ఉన్నా.. అప్పుడే ఈ మోడల్ కు సంబంధించిన కొన్ని ఫొటోలు లీక్ అయ్యాయి. దీంతో ఈ కారును చూసిన ప్రతి ఒక్కరూ ఇంప్రెస్‌అవుతున్నారు. ఇంతకీ ఆ కారు ఎలా ఉందంటే. కొత్త ఆల్ట్రో రేజర్ డిజైన్ అయితే అద్భుతంగా ఉందని అనిపిస్తుంది. ఇందులో బ్లాక్ డ్యూయెల్ టోన్ ను అమర్చినట్లు తెలుస్తోంది. బానెట్ పై ట్విన్ వైట్ స్ట్రిప్స్, ఫ్రంట్ గ్రిల్ వంటివి ఉన్నాయి. ఇందులో డ్యూయెల్ టోన్ అల్లాయ్ వీల్స్ కూడా అమర్చినట్లు తెలుస్తోంది. ఫ్రంట్ వెంటిలేటేడ్ సీట్లు కూడా ఆకర్షించనున్నాయి. ఇప్పటికే దీనిని భారత్ మొబిలిటీ ఎక్స్ పో లో ప్రదర్శించారు. దాని ప్రకారం చూస్తే ఇందులో 10.25 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, రీ డిజైన్ చేసిన ఇనుస్ట్రుమెంట్ కన్సోల్ ఉన్నాయి.

# ఇంత సున్నితంగా వ్యవహరిస్తే ఎలా?



న్యూఢిల్లీ: తమ ఫిర్యాదులలో లేవనెత్తిన అంశాలను ఎన్నికల కమిషన్ జారీచేసిన ఆదేశాలలో ప్రస్తావించలేదని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ విమర్శించారు. ఎన్నికల నిబంధనావళికి సంబంధించి జరిగిన తీవ్ర ఉల్లంఘనల పట్ల ఎన్నికల పట్ల ఎన్నికల కమిషన్ సున్నితంగా వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర బిజెపి నాయకులు చేసిన మతపరమైన ప్రసంగాలపై తాము ఇచ్చిన ఫిర్యాదులలో ఏ ఒక్క అంశాన్ని ఇసి తన ఆదేశాలలో ప్రస్తావించలేదని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. ఎన్నికల నిబంధనావళికి సబంధించి జరిగిన తీవ్ర ఉల్లంఘనలపై ఇసి సున్నితంగా వ్యవహరించడం, సంయమనం పాటించండి, మర్యాదగా తప్పకండి అంటూ రాజకీయ పార్టీలకు హితవు చెప్పడం వల్ల పోయిన ఇసి ప్రతిష్ట తిరిగి రాదని ఏచూరీ వ్యాఖ్యానించారు. బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు ఇసి పంపిన లేఖను కూడా తన పోస్టుకు జతచేశారు. ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు జరిగేలా ఇసి చర్యలు ఉండాలని ఆయన కోరారు. కుల, మత, భాష, మత పరమైన ఉపన్యానాలు చేయరాదని ఆదేశిస్తూ బిజెపి, ఇతర పార్టీలకు ఇసి బుధవారం లేఖ రాసింది. రక్షణ రంగానికి సంబంధించిన అంశాలను రాజకీయం చేయవద్దని కాంగ్రెస్ పార్టీని ఇసి ఆదేశించింది.

# బిఆర్ఎస్ పార్టీవి శవ రాజకీయాలు : మంత్రి జూపల్లి కృష్ణారావు




హైదరాబాద్: బిఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యకు దురలవాట్లు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలే కారణమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల జరిగిన హత్యను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఆ పార్టీ నాయకులు రాజకీయ హత్యగా చిత్రీకరించడం దుర్మార్గపు చర్య అని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో హత్య జరిగినా, రాజకీయ రంగు పులిమి లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కెటిఆరే చెబుతున్నారని, అలాంటప్పుడు రాజకీయ హత్య అని ద్వంద వైఖరి ప్రదర్శించడం ఆయనకే చెల్లిందని మంత్రి అన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. హత్య జరిగిన క్షణాల్లోపే కెటిఆర్, బిఆర్ఎస్ నాయకులు రంగంలోకి దిగి ప్రభుత్వంపై , వ్యక్తిగతంగా తనపై దుష్ప్రచారం చేయడాన్ని జూపల్లి తీవ్రంగా ఖండించారు. ఏం జరిగింది, ఎలా జరిగిందని తెలుసుకోకుండానే కావాలనే తనపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. శవ రాజకీయాలు చేయడం బిఆర్ఎస్‌కు కొత్త కాదని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్కడ శవముంటే అక్కడ గద్దలా వాలి నేరారోపణలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. నేనేంటో ప్రజలకు తెలుసని, ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేదని, అందుకే కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా తనను ఆదరిస్తున్నారని అన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. గంట్రావ్‌పల్లి గ్రామంలో జరిగిన మల్లేష్ హత్యకు కూడా రాజకీయ రంగు పులిమారని, ఇప్పుడు శ్రీధర్ రెడ్డి హత్యను కూడా రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. శ్రీధర్ రెడ్డి హత్యపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారని, విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని, అప్పటి వరకు బిఆర్ఎస్ నాయకులు చేచిఉండాలని సూచించారు. బిఆర్ఎస్ నీచ రాజకీయాలు పరాకాష్టకు చేరాయ ని, ఇకనైనా శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని కెటిఆర్‌కు హితువు పలికారు.

# విజయవాడ మోడీ రోడ్ షోలో అనుమానిత డ్రోన్లు


ఎపిలోని విజయవాడలో ప్రధాని మోడీ రోడ్‌షోలో భద్రతా వైఫల్యంపై కేంద్రం సీరియస్ అయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 8న విజయవాడలో ప్రధాని మోడీ ఎన్డీయే భాగస్వాములు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. నరేంద్ర మోడీ ర్యాలీకి 45 నిమిషాల ముందు, ర్యాలీ ప్రారంభం, చివరలో డ్రోన్‌లు ఎగురవేయడంపై కేంద్ర హోం శాఖ సీరియస్ అయింది. ప్రధాని రోడ్‌షో ప్రాంతం ముందుగానే నోఫ్లై జోన్‌గా ప్రకటించినా డ్రోన్లు ఎలా ఎగరగలిగాయాని కేంద్ర హోంశాఖ డిజిపిని ప్రశ్నించింది. ఈ ఘటన వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిజిపికి కేంద్ర హోం శాఖ లేఖ పంపించింది. ఇప్పటి వరకూ ఇలా ప్రధాని రోడ్ షోలో అనధికారిక డ్రోన్లు ఎగిరిన విషయం బయటకు రాలేదు. ప్రధాని మోడీ భద్రతా ఏర్పాట్లను ఎస్‌పిజి చూసుకుంటుంది. ఏ మాత్రం చిన్న తేడా కనిపించినా సీరియస్‌గా స్పందిస్తుంది. ప్రధాని రోడ్ షో రోజున మొదట ఓ డ్రోన్ ఎగరడం గమనించి కిందకి దించి వేయించారు. ఈ ఘటన తర్వాత మరో డ్రోన్ ఎగరకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే రోడ్ షో ముగిసే సమయంలో మరో డ్రోన్ ఎగిరింది. దీనిపై ఎస్‌పిజి గ్రూప్ అప్పుడే కేంద్ర హోంశాఖకు నివేదిక పంపింది. తీవ్ర భద్రతా ఉల్లంఘనగా భావించింది. బందోబస్తు నిర్వహించిన పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా ఉండటమో, లేకపోతే వారి అనుమతితో ఎగురవేయడమో చేసి ఉంటారని భావిస్తున్నారు. కేంద్ర హోంశాఖ స్వయంగా ఆదేశించడంతో ఇప్పుడు డిజిపి అసలు డ్రోన్లు ఎగురవేసిన వాళ్లు ఎవరు? ఎందుకు ఎగురవేశారు? పోలీసులు ఎందుకు పట్టించుకోలేదు? ఒక వేళ పోలీసులే ఎగురవేస్తే? నిబంధనలు ఎందుకు పట్టించుకోలేదు వంటి అంశాలపై దర్యాప్తు చేసి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మోడీ భద్రతా ఏర్పాట్లను సీనియర్ ఐపిఎస్ అధికారులు చూస్తారు. వారిలో నిర్లక్ష్యం ఎవరితో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మోడీ పర్యటనలో భద్రతా వైఫల్యం ఇదే మొదటి సారి కాదు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే మోడీ చిలుకలూరిపేట బహిరంగసభకు హాజరయ్యారు. ఆ సభలో మొత్తం గందరగోళం ఏర్పడింది. పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. ఫలితంగా ఆ సభ రక్షణ బాధ్యతల్లో ఉన్న పలువురు ఎస్‌పిలపై ఇసి వేటు వేసింది. ఈ సారి మరికొంత మంది ఐపిఎస్ అధికారులపై చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# జూన్ 30 వరకు పలు రైళ్లు రద్దు



హైదరాబాద్: మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు కారణంగా పలు రైళ్లను నెల 27 నుంచి 30 వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే కీలక ప్రకటన చేసింది. రైల్వే ప్రయాణికులు ఈ విషయం గమనించాలని స్పష్టం చేసింది. 07462/63 వరంగల్, సికింద్రాబాద్ పుష్‌పుల్ రైలు, 17035/36 కాజీపేట- బలార్షా, 07766/65 కరీంనగర్ సిర్పూర్ టౌన్, 07894 కరీంనగర్- బోధన్ రైలు జూన్ 30 వరకు రద్దు చేసినట్లు తెలిపింది. అలాగే విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను దారిమళ్లించినట్లు తెలిపింది. రద్దైన రైళ్లలో విజయవాడ-బిట్రగుంట (07978), బిట్రగుంట- విజయవాడ (07977), రాజమండ్రి-విశాఖపట్నం (07466), విశాఖపట్నం- రాజమండ్రి (07467), బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237), చెన్నై సెంట్రల్-బిట్రగుంట (17238), కాకినాడ పోర్ట్- విశాఖపట్నం (17267), విశాఖపట్నం- కాకినాడ పోర్ట్ (17268), విజయవాడ- విశాఖపట్నం (22702), విశాఖపట్నం- విజయవాడ (22701), కాచిగూడ -నడికుడి (07791), నడికుడి కాచిగూడ (07792) నెంబర్ రైళ్లు ఉన్నాయి. వీటితో పాటు విజయవాడ- గుంటూరు (07783), గుంటూరు -విజయవాడ(07788), గుంటూరు- మాచర్ల (07779), మాచర్ల-గుంటూరు (07780) తదితర రైళ్లను సైతం దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. రేపల్లె- మార్కాపూర్ రోడ్ (0788), మార్కాపూర్ రోడ్-తెనాలి (07890), హుబ్లీ -విజయవాడ (17329), విజయవాడ-హుబ్లీ (17330) రైళ్లను పలు స్టేషన్ల మధ్య పాక్షికంగా రద్దు చేసింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్: ఏడుగురు మృతి




రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో గురువారం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణపూర్-బీజాపూర్ సరిహద్దులో పోలీసులు-మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది స్థానిక పోలీసులతో కలిసి గురువారం కూంబింగ్ చేపట్టడంతో మావోలు తరసపడ్డారు. మావోలను లొంగిపోవాల్సిందిగా భద్రతా బలగాలు సూచించాయి. కానీ భద్రతా బలగాలపై మావోలు కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఉదయం 11 గంటల నుంచి కాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఏడుగురు మావోల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల మృతులు సంఖ్య పెరిగే అవకాశం ఉందని భద్రతా బలగాలు వెల్లడించాయి. ఈ ఎన్‌కౌంటర్ వంద మందికి పైగా మావోయిస్టులు పాల్గొన్నట్టు సమాచారం.

# అంబటి రాంబాబుకు ఎపి హైకోర్టులో చుక్కెదురు



ఎపి నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఎపి హైకోర్టులో చుక్కెదురైంది. అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. సత్తెనపల్లిలోని 4 బూత్ లలో రీపోలింగ్ జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని అంబటి రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు. అయితే అంబటి పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అటు, చంద్రగిరిలో స్క్రూటినీ రీ షెడ్యూల్ చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కూడా నిరాశ తప్పలేదు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది.

# సార్వత్రిక సమరంలో మోదీకి భంగపాటు తప్పదు : తేజస్వి యాదవ్



రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీకి భంగపాటు తప్పదని బిహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ స్పష్టం చేశారు. విపక్ష ఇండియా కూటమికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. రోజురోజుకూ తమ కూటమికి ప్రజాదరణ పెరుగుతున్నదని చెప్పారు. అన్ని కులాలు, మతాలు, వర్గాల నుంచి విపక్ష కూటమికి సానుకూల స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలు, వారి ఆశీస్సులతో విపక్షాలు ఇప్పటికే 300 సీట్లను దాటామని ఈసారి ప్రధాని నరేంద్ర మోదీకి బిహార్ ప్రజలు దీటైన సమాధానం ఇస్తారని చెప్పారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ నయ వంచనతో బిహార్‌ను నట్టేట ముంచారని అంతకుముందు పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గ ఆర్జేడీ అభ్యర్థి మిసా భారతి ఆరోపించారు. ప్రధాని మోదీ పాటలీపుత్ర రావడం స్వాగతిస్తున్నామని, ఆయన రాకతో ఆ పార్టీకి రావాల్సిన మరో 5,000 నుంచి 10,000 ఓట్లు రాకుండా పోతాయని అన్నారు. బిహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా, పృత్యేక ప్యాకేజ్ ప్రకటిస్తామని కాషాయ పాలకులు ఊదరగొట్టి ఉసూరుమనిపించారని చెప్పారు. బిహార్‌లో యువతకు ఉపాధి పేరిట పలు కర్మాగారాలు ప్రారంభిస్తామని గొప్పలు చెప్పారని గుర్తుచేశారు. తేజస్వి యాదవ్ యువతకు పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. 17 ఏండ్లుగా సాధ్యం కాని పనులను తేజస్వి యాదవ్ 17 నెలల్లో సాధించారని చెప్పారు.

# ఢిల్లీ శ్రీరామ్ కాలేజీకి బాంబు బెదిరింపు




న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల పోరు నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపుల కలకలం చెలరేగుతోంది. గురువారం ఇక్కడి లేడీ శ్రీరామ్ కాలేజికి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఒక్కరోజు క్రితమే బుధవారం హోం మంత్రిత్వశాఖ కార్యాలయానికి ఇ మెయిల్ ద్వారా బాంబు పేలుతుందనే హెచ్చరిక రావడం కీలక విషయం అయింది. ఇప్పుడు ఇక్కడి ప్రఖ్యాత కాలేజీకి కూడా ఈ బెదిరింపు రావడతో స్థానిక పోలీసు బలగాలు, బాంబు స్కాడ్, బాంబు డిటెక్షన్ టీం హుటాహుటిన కాలేజీకి చేరాయి. అణువణువూ నిశితంగా పరీక్షించాయి. అయితే ఎటువంటి ప్రమాదకర వస్తువు లేదని నిర్ధారించుకున్నాయి. కొద్ది వారాలుగా ఢిల్లీలో తరచూ బాంబు బెదిరింపుల లేఖలు, ఫోన్లు వంటివి వస్తున్నాయి. ఇప్పుడు మధ్యాహ్నం వేళ కాలేజీకి బాంబుబెదిరింపు వచ్చిన విషయాన్ని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ అధికారులు తెలిపారు. వెంటనే కాలేజీకి రెండు అగ్నిమాపక శకటాలను తరలించినట్లు వివరించారు. స్కూళ్లు, ఆసుపత్రులకు అదేపనిగా బాంబు బెదిరింపులు రావడం పోలీసు యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ఎప్రిల్ 30వ తేదీన చాచా నెహ్రూ హాస్పిటల్ కూడా ఇటువంటి బాంబు కాల్ ఎదుర్కొంది. ఇక మే 1వ తేదీన ఏకంగా స్థానికంగా ఉండే 150కి పైగా స్కూళ్లకు రష్యాకు చెందిన మెయిలింగ్ సర్వీసెస్ ద్వారా బాంబు బెదిరింపులు వెలువడటం గందరగోళానికి దారితీసింది. తీహార్ జైలుకు కూడా ఇదే విధంగా ఆకతాయిల నుంచి ఫోన్లు వచ్చాయి, ఈ తంతు పట్ల పెద్ద ఎత్తున ఢిల్లీ పోలీసు విభాగం దర్యాప్తు చేపట్టింది.

# హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డులోకి దూసుకొచ్చిన పోలీసు వాహనం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ పోలీసులు సినీ ఫక్కీలో .. రిషికేశ్‌లోని ఏయిమ్స్ ఆస్పత్రిలోకి ఎంట్రీ ఇచ్చారు. ఓ నిందితుడిని పట్టుకునేందుకు.. ఏకంగా పోలీసు జీప్ తో ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లారు. స్ట్రెచ్చర్లపై ఉన్న పేషెంట్లను పక్కకు జరుపుతూ.. నాలుగో అంతస్తులో ఉన్న వార్డు వరకు వాహనాన్ని తీసుకెళ్లారు. ఆ నిందితుడిని అరెస్టు చేయాలన్న ఉద్దేశంతో ఈ తరహా సాహసం చేశారు. ఈ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. మే 19వ తేదీన ఓ మహిళా డాక్టర్‌ను.. నర్సింగ్ ఆఫీసర్ వేధించినట్లు తెలుస్తోంది. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అతన్ని పట్టుకునేందుకు హాస్పిటల్‌కు వచ్చారు. నిందితుడు సతీశ్ కుమార్.. రాజస్థాన్‌కు చెందిన వాడు. ఆస్పత్రి థియేటర్‌లో డాక్టర్ ని వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఘటనలో అతన్ని సస్పెండ్ చేసి అదుపులోకి తీసుకున్నారు.




# ఉజ్బెకిస్తాన్ సుప్రీంకోర్టు సిజెతో సిజెఐ చంద్రచూడ్ భేటీ



ఉజ్బెకిస్తాన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బక్తియార్ ఇస్లమోవ్‌తో భారత ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ) డివై చంద్రచూడ్ గురువారం తాష్కెంట్‌లో సమావేశమయ్యారు. ఉభయ దేశాల ఉన్నత న్యాయస్థానాల మధ్య ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై వీరిరువురూ ఈ ద్వైపాక్షిక సమావేశంలో చర్చించినట్లు ఒక ప్రకటన తెలిపింది. షాంఘై సహకార సమితి(ఎస్‌సిఓ) సభ్య దేశాలకు చెందిన ప్రధాన న్యాయమూర్తుల సమావేశంలో పాల్గొనేందుకు సిజెఐ చంద్రచూడ్ తాష్కెంట్‌లో పర్యటిస్తున్నారు. అంతర్ ప్రభుత్వ సంస్థ అయిన ఎస్‌సిఓ 2001 జూన్‌లో షాంఘైలో ఏర్పడింది. ప్రాంతీయ భద్రతకు సబంధించిన అంశాలతోపాటు ప్రాంతీయ ఉగ్రవాదం, జాతులవైరం, మత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంపై ఆవిర్భావం నాటి నుంచి సంస్థ ప్రధానంగా దృష్టి సారించింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com